# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 35 సంచిక 9

పేజీలు 40

మే 2016

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో ........................................ పేజీ**


భద్రవాక్యం ........................................2

శ్రీబాబూజీ ఉవాచ........................................3

అమ్మమాట........................................6

ఉగాది సందేశము ........................................8

ఇంటర్వ్యూ విథ్ ది మైండ్ ....................10

శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ కీర్తనలు.......12

మిఠాయి భోగం ........................................13

పవిత్ర దేవాలయం ..............................14

హనుమాన్‌చాలీసా ..............................15

యోగవాశిష్ఠము ........................................18

మంచిని పెంచు ..............................20

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..................22

పరిప్రశ్న ........................................23

విందు........................................25

దేవుడు .................... ....................27

శ్రీకృష్ణకర్ణామృతము..............................28

రుద్రాక్ష మహిమ ..............................29

గీతాధ్యయనమ్ ..............................31

అత్రిమహర్షి ........................................33

అసత్యం - స్వార్థం ..............................35

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37

విష్ణు కథలు- సూరదాస్ ....................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపి హితమ్ ముఖమ్ ।
తత్ త్వం పూషన్నపావృణు సత్య ధర్మాయ దృష్టయే ॥
(ఈశావాస్యోపనిషత్ 15శ్లో॥)

భగవానుడు ప్రసాదించిన దేహమనే ఉపాధి లేక పాత్రను సాధకుడు విచారణ ద్వారా సాధనకి వినియోగించి తన మనస్సు ఆకర్షించి మలిన పరచే సంకల్పాలను లేక విషయాలను విడిచి పెట్టమని హెచ్చరిస్తోంది. అంతేకాదు మనస్సుని సత్యమార్గము లేక తత్త్వ మార్గాన్ని అనుసరించ మంటోంది. అలా సాధనలో ముందుకు సాగిపోయే సాధకుడు విషయాదులకు దూరమై దేహమే తాననే భావనే అన్ని బంధాలకు అనర్థాలకు కారణమని గ్రహించగల్గుతాడు. దేహభావనే సత్యమార్గమును గుర్తించనీయకుండా అవరోధంగా ఉంది.

మనస్సు సాధకుడిని హెచ్చరిస్తోంది. విషయాదుల మోహంలో ఎందుకు చిక్కుకుంటావు? అవి నిన్ను హింసించి పీడిస్తాయి. వాటి బాధను భరించలేవు. విషయాదుల వలన నీ దేహానికి ఏద్రైనా ఆనందం చేకూరుతోందా? దేహము అశాశ్వతమైనది. అదే అన్ని బంధాలకు కారణము. దానిని గుర్తించమని మనస్సు హెచ్చరిస్తోంది.

ఆ భావన కలుగకుండా విషయవాసన అడ్డుపడుతోంది. విషయ వాసనను నిరోధించలేకపోతున్నావు. కాబట్టి బహిర్ముఖమైన విషయాదుల వెంటపడే ఇంద్రియ సంయమనాన్ని సాధించి, మనస్సుని అంతర్ముఖం చేస్తే దేహవాసన అనే బంధ విముక్తి కల్గుతుందని మనస్సు హెచ్చరిస్తోంది.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "నా రిసెర్చ్‌లో నాకు తెలిసినది ఏమిటంటే గృహస్థాశ్రమం సాధనకి చాలా అనుకూలమైనది. అది మోక్షాన్ని పొందటానికి షార్ట్‌కట్. గృహస్థులంతా వారింటికి రమ్మని నన్ను ఆహ్వానిస్తారు. సంతోషం. కానీ భక్తిగానీ, భగవత్ జిజ్ఞాసగానీ లేని ఇంట నేను ఎన్నడూ అడుగుపెట్టను. నాకు సోమయ్యగారన్నా, నారాయణఅన్నా చాలా ఇష్టం. వారు ఆహ్వానించకుండానే వారింటికి నేను తరచుగా వెడుతూ వుండేవాడిని. ఎందువలన అంటే వారిద్దరూ బ్రహ్మచర్యం అవలంబిస్తారు.



గృహస్థాశ్రమంలో ఉన్నా మోక్షం పొందాలంటే బ్రహ్మచర్యము, సన్యాసమూ రెండూ ఆచరించవలసినదే. కానీ ఆ రెండింటినీ సరిగా అర్థం చేసుకోవాలి. నిజమైన భక్తునికి మనస్సు భగవంతునిపై లగ్నం కావాలంటే ఏ ఒక్క సంకల్పం మిగిలిఉన్నా అది సాధ్యపడదు కదా! మరి బ్రహ్మచర్యము అవలంబించనివాడు ఆత్మ సాక్షాత్కారాన్ని ఎలా పొందగలుగుతాడు? అయితే బ్రహ్మచర్యము అంటే అందరూ భావించినట్లు భార్యా, పిల్లల్ని పరిత్యజించడం కాదు సుమా!

పరస్త్రీని చూసినపుడు ఏరకమైన వికార భావం కలగకూడదు. పరస్త్రీని మాతృమూర్తిగా భావించాలి. జంతువులకు, పశుపక్ష్యాదులకు కామ వాంఛ కొన్ని ఋతువులకే పరిమితమై ఉంటుంది. కానీ మానవుడికి అటువంటి నిబంధనలు లేవు కదా! అలాగని మానవుడు తనకు కలిగిన వాంఛని బలవంతంగా నిరోధించకూడదు. అయితే ఆ కోర్కె ధర్మబద్ధమైనదైతే దానిని నెరవేర్చుకుని విచారణ చెయ్యాలి. అలా విచారణ చేయగా చేయగా అది క్రమేపీ సమసిపోతుంది. ఒక సంవత్సరం వయస్సు కల్గిన పిల్లవాడు మాతృమూర్తి వద్ద ఏ స్థితిలో ఉంటాడో మనమూ అలా ఉండగల్గితే అప్పుడు ఇంద్రియ నిగ్రహము సాధించగలిగినట్లు భావించాలి. గృహస్థాశ్రమం చాలా గొప్పది. నీలో ఏ

సంకల్పం జనించినా దానిని విచారణ చేసి ఆ సంకల్పము ద్వారా మనము పొందిన సుఖము శాశ్వతమా? అని ప్రశ్నించుకుని శాశ్వతమైన ఆనందం అంటే ఏమిటి? దానిని ఎలా పొందాలి? అనే వివేకవంతమైన విచారణ ద్వారా మనస్సు సత్యాన్ని గ్రహిస్తుంది. సత్యాన్ని గ్రహించిన మనస్సు స్థిరపడుతుంది. సంకల్పములేని స్థితియే బ్రహ్మచర్యం అనవచ్చు. గురులక్ష్యార్థ సాధనకి బ్రహ్మచర్యము తప్పనిసరి. గృహస్థు తన భార్యతో దాంపత్య జీవితాన్ని గడపడానికి ఏ ఆక్షేపణాలేదు. దానిని ఏ శాస్త్రము నిరోధించదు. అయితే గురు లక్ష్యార్థాన్ని మాత్రము ఎట్టి పరిస్థితులలోనూ మరవరాదు. గురు లక్ష్యార్థాన్ని రాపిడి పెట్టగా పెట్టగా నీలోని సంకల్పాలన్నీ రహితమై అప్పుడు మీ భార్యా భర్తల మధ్య ప్రేమ మాత్రమే మిగులుతుంది.

ఇక్కడ మీకొక ఉదంతం చెబుతాను. లక్ష్మణ కుమారుడికి దేహం మీద మచ్చవచ్చింది. దానిని నివారించడానికి ఒక సభను ఏర్పరచి మహారాజులను సామంతులను, మునులను, మహర్షులను అందరినీ ఆహ్వానించారు. శ్రీ కృష్ణ పరమాత్మను కూడా నామ మాత్రంగా ఆహ్వానించారు. మహర్షులందరూ కలసి ఒక తాంబూలాన్ని పంపించి దానిని ఎవరైనా అస్ఖలిత బ్రహ్మచారి స్వీకరిస్తే లక్ష్మణ కుమారుని దేహం పైన మచ్చ తప్పక పోతుందనినిర్ణయించారు. కానీ ఆ తాంబూలాన్ని స్వీకరించడానికి నారదుడే కాదు, భీష్మాదులతో సహా ఎవ్వరూ సాహసించలేదు. చివరకు ఆ తాంబూలాన్ని పెద్దలంతా నిర్ణయించి శ్రీ కృష్ణ పరమాత్ముని వద్దకు పంపించారు. శ్రీ కృష్ణ పరమాత్ముడు ఆ తాంబూలాన్ని స్వీకరించిన మరుక్షణం లక్ష్మణకుమారుని దేహంపై మచ్చ తొలగిపోయింది. ఇంత జరిగినా కౌరవులంతా శ్రీకృష్ణపరమాత్ముడు ఏదో ఇంద్రజాలం చేశాడనీ సభ ముగిసిన మరుక్షణం మళ్ళీ మచ్చవస్తుందని అభాండాలు వేశారు.

చూశారా కౌరవులది ఇంద్రియదృష్టి. వారి దృష్టికి కృష్ణతత్త్వం ఎలా గోచరిస్తుంది? వారికి కేవలం శ్రీ కృష్ణుని రాసలీలలూ, అష్టభార్యలూ, పదహారు వేలమంది రాచకన్యలు గోచరిస్తారు. అటువంటి దేహదృష్టి లేక ఇంద్రియ దృష్టి ఉన్న మానవుడికి స్త్రీని చూడగానే

నీచభావం కలుగుతుంది. అతడు గృహస్థు అయినా సన్యాసి అయినా ఆ భావనలో మార్పు ఉండదు. భక్తరామదాసు, కబీర్‌దాసు సంసారులు కారా? కానీ వారికి దేహదృష్టికానీ, ఇంద్రియ దృష్టికానీ ఉందా? పోనీ దారాపుత్రాదుల వ్యామోహం ఉందా? గృహస్థు తన స్వధర్మాన్ని తప్పక ఆచరించవలసిందే. కానీ అది ఎంతవరకు అవసరమో అంతవరకే తన పాత్రను నిర్వహించాలి. రాజయోగం చాలా గొప్పది. సంసార బాధ్యత ఎన్నడూ విస్మరించరాదు. కొంతమంది సంసార భారాన్ని మోయలేక దారాపుత్రాదులను వదిలివేసి కమండలము, దండము, రుద్రాక్షలు, కాషాయ వస్త్రాలు ధరించి సన్యాసాశ్రమాన్ని స్వీకరిస్తారు. వేషభాషలచేత ఎన్నడూ సన్యాసి కాలేడు. మనోవృత్తులు రహితమైనవాడే నిజమైన సన్యాసి. సంసారాన్ని మనం వదలవలసిన పనిలేదు. సమయం వచ్చినప్పుడు అదే మనకు దూరమవుతుంది. సాధనకి సంసారము ఎన్నడూ ప్రతిబంధకముకాదు. చెట్టును ఆశ్రయించిన ఫలముగానీ ఆకులుగానీ శాశ్వతంగా ఉంటాయా? అవి పక్వస్థితికి రాగానే రాలిపోతాయి కదా!

నేను, నాది అనే భావన రహితమవ్వాలిగానీ సంసారాన్ని ఎన్నడూ దూరం చేసుకోవలసిన అవసరం లేదు. సంసారాన్ని. దారాపుత్రాదుల్ని వదిలివేసి జ్ఞానశూన్యుడైన మానవుడు పదవీ వ్యామోహంతో లేక కీర్తి వ్యామోహంతో తాను గురువునని చెప్పుకుని శిష్యులని తరింపజేస్తానని ప్రగల్భాలు పలికి శిష్యులను చేరదీస్తే ఘోర నరక ప్రాప్తి తప్పదు సుమా! తన కడుపు నిండినవాడు ఇంకొకడికి పెట్టగల్గుతాడు గానీ తన ఆకలి తీర్చుకోలేని వాడు ఇంకొకరి ఆకలిని ఎలా తీర్చగల్గుతాడు? ఒక గుడ్డివాడిని ఆశ్రయించిన గుడ్డివాడి గతి ఏమౌతుంది? ఇద్దరూ కలిసి గోతిలో పడతారు. అందువల్ల అనుభవజ్ఞుడైన సత్య గురువును ఆశ్రయించిన గృహస్థుకు లోటేముంది? తప్పక మోక్ష ప్రాప్తి గలుగుతుంది” అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## అంతర్మథనం కావాలి

అందరికీ శ్రీ దుర్ముఖి నామ సంవత్సరాది శుభాకాంక్షలు. మన్మథ నామ సంవత్సరం వెళ్ళిపోయింది - దుర్ముఖి నామ సంవత్సరం వచ్చింది అంటున్నాము. 'దుర్ముఖి' అనే పేరు వినగానే భయపడతాం. మనస్సు మన్మథ బాణాలలో చిక్కుకోకుండా, భగవంతునివైపే తిరిగి వుంటే అంతా 'సుముఖం'గానే వుంటుంది.

ఇంతకీ కాలం మన చేతిలో వున్నదా? లేక కాలం చేతిలో మనం వున్నామా? అని ఒక్కళ్ళైనా ఆలోచించడానికి టైమ్ యిస్తున్నారా? గొర్రెల మందలాగ కాలం పరుగెడుతూ వుంటే, దానితోపాటు మనం కూడా పరుగెడుతున్నాము. అసలు ఇక్కడ ఏం జరుగుతోందో ఎవరైనా ఆలోచిస్తున్నారా? మీరు బజారుకెళ్ళి సరుకులన్నీ కొని తెచ్చుకుని ఇంటికి రాగానే ఏం చేస్తారు? బిల్లు ప్రకారం సరుకులన్నీ వచ్చాయో లేదో చూసుకుంటారు. అదే మహాత్ముల సన్నిధికి వెళ్ళి ఏమి సాధించుకు వచ్చామని ఎవరైనా ఆలోచిస్తున్నారా?

బజారుకెళ్ళి నిండుగా వుండే పర్సులన్నీ ఖాళీ చేసుకుని వస్తున్నారు. అదే మహాత్ముల సన్నిధికి వెళ్ళినప్పుడు, ఖాళీ మనస్సులతో వెళితే వాటి నిండా వారి యొక్క దివ్యబోధామృతాన్ని నింపుకోవచ్చు. మనమంటూ వుంటే అది మన్మథో, దుర్ముఖో తెలుసుకుంటాం. రేపు మన గతి ఎలా వుంటుంది అనేది భగవంతుడి చేత నిర్ణయింపబడి వుంటుంది.

మన గురించి మనం ఆలోచించి తీరాలి. అంటే అలాగ అన్నామని మీ మీ వ్యాపారాల గురించి, ఇతర వ్యాపకాల గురించీ కాదు. ఇన్నేళ్ళలో మహాత్ములు వచ్చి ఎంత చెప్పారు? మనమెంత విన్నాం? విన్నది ఎంత ఆచరిస్తున్నాం? అన్నది మనని మనం ప్రశ్నించుకోవాలి.

మహాత్ములు తమ జీవితాలను మనకోసం త్యాగం చేశారు. మన గురుదేవులు శ్రీబాబూజీ మహరాజ్; శ్రీ షిరిడీ సాయిబాబా ఇత్యాది మహానుభావులు తమ స్వస్వరూపాన్ని మానవులను ఉద్ధరించటానికే అర్పించారు.

నిజంగా తృప్తినిచ్చేది శ్రీగురుదేవుని విగ్రహంలోని చిరునవ్వు. భగవద్విముఖమైన మనస్సుకి దుర్ముఖమే. కానీ, భగవంతునికి సుముఖమై వుంటే మనకేం భయం? సృష్టి స్థితి లయాలు చేసే గురు బ్రహ్మవైపుకి మనం సుముఖులమై వున్నప్పుడు, దుర్ముఖి మననేమీ చేయలేదు. రాక్షస తండ్రిని కలిగి వున్నా ప్రహ్లాదుడు సుఖమే అనుభవించాడు. 'నా దేవుడు నన్ను నడిపిస్తున్నాడు' అనే ధీమాను కలిగి వున్నాడు కనుక అతడు భయపడలేదు.

ప్రభువులేని సృష్టి లేదు. ఆయన లేకుండా ఒక్క అణువు కూడా లేదు. సూరదాసు, ప్రభువును కీర్తించాడు 'ప్రభూ! ఎవరి ద్వారం ముందుకు వెళ్ళి నేను తలవంచుకుంటానయ్యా? నాకు కావలసినది వారు ఇవ్వగలరా?' అని కీర్తించాడు.

ఆ పరమాత్మను గుర్తించడం రావాలి. ఒకటి ప్రక్కన్న ఎన్ని సున్నాలున్నా వాటికి విలువ వుంటుంది. ఆ 'ఒక్కటి' లేకపోతే ఎన్ని సున్నాలున్నా శూన్యమే. ఆ భగవంతుడిని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలి. ఇది గుర్తించిన నాడు నీకు ఆనందం లభిస్తోంది. జీవితాంతం ఆ సత్యవస్తువును గుర్తిస్తూ వుండటమే సాధన.

అట్టి సత్యవస్తువును గుర్తించడానికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, అఖండ సాధన సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

## యోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారి ఆశ్రమేతర కార్యక్రమ వివరాలు

మే 2016

16-5-16 ప్రకాశం జిల్లా పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన కార్యక్రమములలో శ్రీ మాతాజీ ప్రవచనం.

# ఉగాది సందేశము

-సుషుమ్న ప్రసాద

మనము మన్మధ నామ సంవత్సరానికి వీడ్కోలు చెప్పి, దుర్ముఖి నామ సంవత్సరములో ప్రవేశించాము. తెలుగువారి కాలమాన ప్రకారం వసంతఋతువు ప్రవేశించగానే వచ్చే చైత్రమాస శుక్ల పాడ్యమి శుభోదయాన నూతన సంవత్సరం (ఉగాది) ప్రారంభమవుతుంది. ఉగాది పదము యుగాదికి రూపాంతరము. అంటే యుగానికి ఆది దినంగా, పర్వదినంగా పరిగణిస్తున్నాము. వాస్తవంగా చూస్తే కాలమనేది అనంతమైనది. అంటే ఆద్యంతములు లేనిది. కాని మానజీవితం జనన మరణములు (అంటే ఆద్యంతములు) అనే పరిధిలో యిమిడి వున్నది. ఆద్యంతములు లేని కాలాన్ని, పరిమితిమైన జీవిత పరిథిలో వున్న మానవుడు గణించటమనేది హాస్యాస్పదమే. ఎందుకంటే కాలము భగవత్స్వరూపము.

శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో (అ.10/30శ్లో॥) 'కాలః కలయతామ్యహం' అని రూఢిగా చెప్పారు. అంటే 'లెక్కింపబడేవాటిలో కాలాన్ని నేనే' అని దాని అర్థం. అలాగే (అ.10/35శో॥) ఋతూనాం కుసుమా కరః - అంటే 'ఋతువులలో వసంత ఋతువును నేనే' యని రూఢిగా చెప్పబడింది. భగవానుడు విశ్వరూప సందర్శన యోగంలో (అ.11/32 శ్లో॥) 'కాలోస్మిలోకక్షయ కృత్ ప్రవృద్ధః '- అంటే 'ఈ సర్వస్వాన్ని లయింపచేసే కాలస్వరూపుడిని నేనే' అని తెలియజేశాడు.

తెలుగువారి కాలమాన ప్రకారం చైత్ర శుద్ధ పాడ్యమి అంటే వసంత ఋతువు ఆగమనంతో ఉగాది ప్రారంభమవుతుంది. రోమన్ క్యాలెండర్ ప్రకారం కూడా వసంత ఋతువుతోనే నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఎందుకంటే 'SPRING is the king of season' అన్నారు. వసంతాగమనముతో ప్రకృతి రంగురంగుల సీతాకోకచిలుకలా ఫల, పుష్పాదులతో మధురమైన మామిడి పండ్లతో, పరిమళభరితమైన మల్లెపూలతో, ఎంతో రమణీయంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. అంటే అందమైన పువ్వులతో, ఆహ్లాదకరమైన వాతావరణంతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతాము.

తెలుగువారి కాలమాన పరిగణలో 60 సవంత్సరాలు ఒక సైకిలు. అంటే మానవజీవితంలో పరిణతి, పరిపక్వత, పరిపూర్ణత సాధించటానికి 60 వర్షాలు తలమానికం వంటిది. ప్రభవనామ సంవత్సరంతో ప్రారంభమై దుర్ముఖినామ సంవత్సరము సరిగా మధ్యలో వస్తుంది. దుర్ముఖి 30వ సంవత్సరము. దుర్ముఖి సంవత్సరము భయానకరంగా వుంటుందని భయపడనవసరం లేదు. మన్మధనామ సంవత్సరంలో మనస్సును మధనం చేస్తే, బాహ్యవిషయాలకు మనస్సు దుర్ముఖమై, దృష్టి అంతర్ముఖమైతే అంతా సుముఖంగా, శుభమయంగా వుంటుంది. విషయాసక్తమైన మనస్సే దుర్ముఖి. విశ్వేశ్వరాసక్తమైన స్థిరచిత్తముంటే అంతా సుముఖంగానే వుంటుంది.

సద్గురుపాదాశ్రయంచేసి, అచంచల విశ్వాసముతో సద్గురు స్మరణ చేసేవానికి, ప్రతి సంవత్సరము శ్రీముఖమై, నిత్యతృప్తులై వర్ధిల్లుతారని సద్గురుదేవులు అభయమిచ్చారు.

ఉగాది పర్వదినం నాడు అభ్యంగన స్నానమాచరించి, శుచిర్భూతులై ఉగాది ప్రసాదాన్ని స్వీకరించి, కార్యోన్ముఖులు కావటం తెలుగువారి సుసాంప్రదాయము. తీపి, వగరు, చేదు, పులుపు, వుప్పు, కారము మున్నగు షడ్రుచులతో కూడిన ప్రసాదాన్ని స్వీకరించడం జీవితంలో సుఖదుఃఖాలను, లాభనష్టాలను జయాపజయాలను సమదృష్టితో స్వీకరించే సమన్వయ స్థితిని సూచిస్తుంది. కామక్రోధ లోభమోహ మద మాత్సర్యములనే షడ్వికారములకు స్వస్తి చెప్పి, శమము, దమము, ఉపరతి, తితీక్ష, శ్రద్ధ, సమాధానమనే శమాది షట్క సంపత్తిని పెంపొందించుకుంటే, సత్సాంగత్యము, సదసద్వివేకము, సత్శీలము, సంతోషము, సంతృప్తి, సంఘసేవ అనే షడ్సంపదలతో వర్ధిల్లి, లోకహితైషులై జగత్కళ్యాణానికై తోడ్పడుతారని సద్గురుదేవుడైన శ్రీ బాబూజీమహరాజ్ మనకు అభయహస్త మిస్తున్నారు!





# INTERVIEW WITH THE MIND

## ధ్యాన ప్రక్రియ

**(శ్రీ మాతాజీ వారి దివ్య ప్రసంగాలనుండి)**

ధ్యానంలో కుదురుగా కూర్చోవటం కష్టం అనిపిస్తుంది. ఎందుకంటే మన మనస్సుని ధ్యానానికి సరిగా ప్రిపేర్ చెయ్యలేదు కనుక. మానవుడు ప్రపంచ విషయాలలో మునిగి కర్మను మూట కట్టుకొని దిగజారిపోతున్నాడు. కాని తాను తరించే మార్గాన్ని వెదకటం లేదు. సమర్థులైన సద్గురువులను ఆశ్రయిస్తే వారు తరించే మార్గాన్ని బోధిస్తారు.

రత్నాకరుడు ఒక బందిపోటు దొంగ. ఎన్నో హత్యలు, దోపిడీలు చేశాడు. అతని ఉత్తమ సంస్కారంచేత ఉద్ధరింపబడే తరుణం వచ్చి అతనికి నారదులవారి దర్శనం అయింది. ఆయన ఇతడిని సరైన మార్గం చూపించి శ్రీరామతారకాన్ని ఉపదేశించాడు. అంతే! అతడు ధ్యానముద్రలో ఉండిపోయాడు. కాలం తెలియలేదు. ఋతువులు తెలియలేదు. అతనిపైన పుట్టలు లేచాయి. ఆ పుట్టలలో సర్పాలు వాసం చేశాయి. గురు అనుగ్రహం వల్ల ఆయన వాల్మీకి మహర్షిగా మారాడు. శ్రీమద్రామాయణకావ్యాన్ని అనుభవిస్తూ రచన చేశాడు. అలా చేయించింది గురుశక్తి. అది అనంతం. సర్వవ్యాపకం.

మనకి సద్గురు సమాశ్రయం దొరికింది. వారు సూచించిన మార్గంలో నడిస్తే మనంకూడా సాధనలో ఉత్తమస్థితిని తప్పక పొందుతాం. మనం నియమానుసారంగా జప తపాదులు చేస్తూ మన కర్తవ్యాన్ని నిర్వర్తించుకోవాలి. ధ్యానంలో మనకు మనస్సుతో జరిగేదే interview. ఈ ఇంటర్వ్యూలో స్వామి బోధామృతాన్ని విచారణకు తెచ్చుకోవాలి. బాహ్యవిషయాలపై మనస్సు చరిస్తే అది outerview అవుతోంది. స్వామి ఎప్పుడు వస్తారా? అని ఎదురు చూడటం ధ్యానం అవుతోంది.

పరమాత్మతో తాదాత్మ్యం చెందే ప్రయత్నమే ధ్యానం. ధ్యానం అంటే భగవంతునితో మనస్సు చేసేదే ఇంటర్వ్యూ. అంటే మనం భగవంతుడిని

'వ్యూ' చేస్తున్నాం.  మనం బాహ్య విషయాలతోచేసేది 'ఔటర్‌వ్యూ.' 'ఇంటర్‌వ్యూ' ఎంత సేపు  చేస్తున్నాం? 'ఔటర్‌వ్యూ' ఎంత సేపు జరుగుతోంది అని విచారణ చేస్తే మనం ఎక్కువ కాలం ఔటర్‌వ్యూలో గడుపుతున్నాం. అంటే  జరిగినవాటిని గురించి, జరగబోయే  వాటిని గురించి సతమతమవుతూ ఇప్పటి సంగతిని విస్మరిస్తున్నాం. ఈ క్షణమే నీది. అది తిరిగి రాదు. కాబట్టి భగవద్విచారణలో ఎక్కువ కాలం గడపాలి. భగవంతునిపై నిష్ఠ నిలపాలి.

ధ్యానానికి పూజ సామాన్లు, పాత్రలు అక్కరలేదు.  నీ హృదయం అనే పాత్రను శుద్ధి చేసికోవాలి. అంటే అంతఃకరణ శుద్ధికావాలి. అందుకే మహాత్ములు మనలను, "నిర్మలాంతఃకరణ సిద్ధి రస్తు' అని దీవిస్తారు.

మనం శ్రీ గురుదేవులు మనకు ప్రసాదించిన ధ్యాన సప్తాహాలలో ఆఖరిమెట్టులో ఉన్నాం. భగవద్గీతలో భగవానుడు, "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ। అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః " అని చెప్పాడు. "అంటే సర్వ ధర్మాలను విడిచి నేనొక్కడినే కర్తయని ఆరాధించువాడిని సర్వపాపములనుండి ముక్తుడిని చేస్తాను" అని అభయం ఇస్తున్నాడు.

లాంతరు గ్లాసుకు పట్టిన మసి బయట తుడిస్తే పోతుందా? పోదు. అలాగే మనం మనస్సులో మైలను తుడవటానికి ప్రయత్నం చేయటం లేదు. నిరంతర విచారణ ద్వారా మనస్సులో మైలను రహితం చేసికోవాలి. చిత్తశుద్ధికోసం మనోనాధుడిని ప్రార్థిస్తే ఆయన తప్పక నిన్ను అనుగ్రహిస్తాడు.

అయన నీ హృదయంలో నెలకొని నిన్ను నడిపిస్తున్నాడు. ఆయనను శరణు వేడు. "ప్రభూ! ఇదంతా నీ దయ!  నీ దయ లేనిదే ఏదీ లేదు. నా తను మన ధనాలు నీవే. ఇదంతా నీ అనుగ్రహమే" అని భావించు. నీకు నువ్వే  నీలోని పరమాత్మను  ఆరాధించుకొనే మహదవకాశం నీకు లభించింది.  ఇదే విధంగా నీ అనుష్ఠానాన్ని కొనసాగిస్తూ నీ గమ్యస్థానాన్ని చేరుకో! శ్రీ గురుదేవులు నీకు అట్టి శక్తిని సాధనా సంపత్తిని, ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించెదరు గాక ! సుఖీభవ!



# శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ కీర్తనలు

## మానసపూజ

హృదయమె శివ మందిరమని మొదలు తెలియవే మనసా। మాయయను
కవాటము ఆ మందిరమును మూసినదే,
శివుడే సద్గురు రూపము స్వీకరించి వచ్చెనే,
తన కృపా ప్రసారమ్మున ద్వారమ్మును తెరచునే।
తన బోధల వెలుగున శివ దర్శనమ్ము చేయించునే ॥హృద॥

1. ఆర్తితోడ పిలిచి స్వామికావాహన సేయవే।
సహస్రార కమలము ఆసనముగ అర్పించవే
కన్నీరే పన్నీరుగ కాళ్ళు కడుగవే।
ఆనందాశృజలమ్ముల అర్ఘ్యమీయవే మనసా ॥ ॥హృద॥

2. అనురాగమె అమృతముగ అభిషేకము సేయవే
సదమల భక్తియె గంగా జలముగ స్నానమ్మిడవే।
ఆలింగనమను వస్త్రము ఆత్మ విభునకీయవే ॥
శమదమాది భూషణముల సఖునలంకరింపవే ॥హృద॥

3. స్వామి దివ్య నామ మంత్ర సహస్రార్చన సేయవే
వాసనలను కాల్చి అగరు వత్తులు వెలిగింపవే।
జ్ఞానము దీపముగ చేసి స్వామిని దర్శింపవే
అహంకార మమకారములవసర నైవేద్యమిడవే ॥హృద॥

4. కామ ప్రముఖ షడ్రస సంకలిత మృష్ఠ భోజనముగ
నినునీవే స్వామికాత్మనివేదనము చేసికొనవే।
తమకము విడెముగ నమర్చి తాంబూలము నీయవే
ఆశయె కర్పూరముగా హారతి వెలిగింపవే ॥ ॥హృద॥

5. గురుడె విరాట్పూరుషుడని మంత్ర పుష్పమీయవే
సకలేంద్రియ సమర్పణగ సాష్టాంగము సేయవే।
చూపులోన చూపు నిలిపి స్వామి రక్షయొసగునే
స్వామియు నీవును జగమును సర్వము శివమయమగునే ॥హృద॥

# మిఠాయి భోగము

-సేకరణ మురళీ

(వార్తాలాపం నుండి)

మలిక్ దినార్ అనే మహమ్మదీయ సత్పురుషుడొకడుండేవాడు. ఆయన చాలా కాలం మృష్టాన్న భోజనం చేసేవాడు కాదు. ప్రతిరోజూ సాయంత్రం రొట్టెల దుకాణానికి వెళ్ళి ఒక రొట్టె కొనితెచ్చి, అది తిని మంచినీళ్ళు త్రాగి ఆ రోజు ఉపవాస భంగం చేసేవాడు. అతను ఎంతో ఆరోగ్యంగా వుండేవాడు.

ఒకసారి అతనికి అజ్ఞానవశంచేత మిఠాయి తినాలనే కోరిక కలిగింది. ఎన్నో రోజులు తనను తాను నిగ్రహించుకున్నాడు. అయినా ఆశ అతనిని వెంటాడటం మానలేదు. అంతట ఒకరోజు మిఠాయి కొనుక్కుని యింటికి వచ్చాడు. ఆ దుకాణం యజమానికి యీ మలిక్ దినార్ మిఠాయిని ఏం చేస్తున్నాడో చూడాలనిపించి, ఒక సేవకుని అతని వెనుక పంపాడు.

కొంచెం దూరం వెళ్ళాక మలిక్ దినార్ బుట్టలో నుండి మిఠాయి బయటకు తీసి, మూడుసార్లు దాని వాసనను పీల్చి, "ఓ మనసా! నీకు ఈ మాత్రం భోగం చాలు" అని చెప్పి, ఆ మిఠాయిని ఒక బిచ్చగాడికి యిచ్చివేసి, తిరిగి తన మనస్సుకు యిలా బోధించాడు -

"ఓ బలహీనమైన మనసా! నియమానుసారం నడుచు కొనటానికి నేను నిన్ను బాధించ దలచాను. నాకు నీ యందు ద్వేషం లేదు. నిన్ను మిత్రునిగా తలచుట చేతనే యిట్లా చేశాను. కొద్ది రోజులు ఓపిక పట్టు. ఏదో ఒక రోజు నీకు యీ దుఃఖాలు అన్నీ నశించి, శాశ్వత సుఖం నీకు లభిస్తుంది."

---

**కాళీ వనాశ్రమము పావులూరి శాఖలో మాతాజీవారి సత్సంగ సమావేశాలు**

పావులూరు శాఖలో శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి 41వ పుణ్యారాధన మహోత్సవములు, సత్సంగసమావేశములు, అఖండ హరినామ సంకీర్తన

2-6-16 నుండి 7-6-16 వరకు ప్రతిరోజూ పూజ్యశ్రీ మాతాజీ బోధ; రామానుజదాస్‌వారి ప్రవచనం ఉంటాయి.

వివరాలకు - శ్రీరామంగారు 94405 25600

# పవిత్ర దేవాలయం

ఒక గ్రామంలో ఒక దేవాలయానికి ధర్మకర్త ఉండేవాడు. ఆయన ఆ ఊరివారికి పురాణం చెబుతూ ఉండేవాడు. ఒకనాడు పురాణం చెబుతూ ఆయన "జ్ఞాని దృష్టిలో అంతా ఈశ్వరుడే. వీడు బ్రాహ్మణుడు, వీడు చండాలుడని పామరులు విచక్షణ కల్పించుకుంటారు. అది గ్రహించినవాడే నిజమైన జ్ఞాని" అని చెప్పాడు.



దూరంగా ఉండి ఆ పురాణం విన్న అస్పృశ్యుడొకడు పురాణం పూర్తికాగానే ధర్మకర్తతో "అయితే స్వామీ! నన్ను దేవాలయంలోకి రానివ్వటానికి అభ్యంతరం ఏమిటి? తమరు జ్ఞాని కదా! తమకు తేడా ఏమీ లేదు కదా!" అన్నాడు.

ధర్మకర్త బిత్తరపోయి "నేను జ్ఞానినే అనుకోరా. ఆలయంలో దేవుడు అనుమతించవద్దా? దేవుడేమంటాడో అడిగి తెలుసుకుంటాను. కొంచెం ఓపిక పట్టు" అన్నాడు.

అస్పృశ్యుడు కొన్నాళ్ళ తరువాత ధర్మకర్త దగ్గర యీ ప్రస్తావన తీసుకువస్తే, ఆయన "ఇంకా దేవుడు నాకేమీ చెప్పలేదురా" అన్నాడు. మళ్ళీ కొన్నాళ్ళ తరువాత యిద్దరూ కలుసుకున్నప్పుడు ధర్మకర్త "నీ కోరిక విషయం దేవుణ్ణి ఎన్నిసార్లు అడిగినా దేవుడేమీ చెప్పకుండా ఉన్నాడురా" అన్నాడు. దానికి ఆ అస్పృశ్యుడు "ఆ మాట ఆ దేవుడు నాతోనే స్వయంగా చెప్పాడు లెండి" అన్నాడు. ధర్మకర్త "ఏం చెప్పాడేమిటి?" అని ఆదుర్దాగా అడిగాడు.

అస్పృశ్యుడు "ఒరేయ్! ఆ గుడిలోకి వాళ్ళు నన్నే రానివ్వటం లేదు. ఇహ నిన్ను ఎందుకు రానిస్తార్రా?' అని ఆ దేవుడు నాతో అన్నాడండీ" అన్నాడు.

# హనుమాన్ చాలీసా

(గత సంచిక తరువాయి) - కొంపెల్ల రామకృష్ణ (LONDON)



20. దుర్గమకాజ జగతకేజేతే।
సుగమ అనుగ్రహ తుమ్హారే తేతే ॥

ప్రపంచంలో ఎన్నెన్ని దుర్గమ కార్యాలున్నాయో అవన్నీ నీ అనుగ్రహంతో చాలా సులభంగా సుగమం అయిపోతాయి. నీ అనుగ్రహంతో అన్ని కార్యాలు నిర్విఘ్నంగా పూర్తి అవుతాయి.

21. రామదుఆరే తుమరఖవారే।
హొూతన ఆజ్ఞా బినుపైఠారే ॥

నీవు రాముని యొక్క ద్వారం దగ్గర రక్షకుడివై ఉన్నావు. నీ ఆజ్ఞలేనిదే రాముడు లభించడు.

22. సబ సుఖలహై తుమ్హారీ శరనా।
తుమరక్షక కాహూకో డరనా ॥

నిన్ను శరణు పొందినవారికి అన్ని సుఖాలు లభిస్తాయి. నీ రక్షణలో వున్న వానికి ఎట్టి భయము వుండదు.

23. ఆపనతేజ సమ్హారో ఆపై। తీనోఁలోక హాంకతేకాంపై ॥

నీ తేజస్సును నీవే సంభాళించుకోగలవు. నీ యొక్క గర్జనకు ముల్లోకాలు గడగడ వణికిపోతాయి.

24. భూతపిశాచ నికటనహి ఆవై। మహావీర జపనామసునావై ॥

ఓ మహావీరా! నీ నామజపం వింటేనే భూతపిశాచములు దగ్గరకు రావు.

25. నాసై రోగహరై సబ పీరా। జపత నిరంతర హనుమత వీరా ॥

నిరంతరము వీరహనుమ నామ జపం చేసేవారికి సర్వరోగములు, సకల పీడలు తొలగిపోతాయి.

26. సంకటసే హనుమాన ఛుడావై। మనక్రమ వచన ధ్యానజోలావై

ఎవరైతే మనసా వాచా కర్మణా హనుమ ధ్యానం చేస్తారో, వారిని హనుమ అన్ని సంకటముల నుండి విడుదల చేస్తాడు.

27. సబపర రామరాయ సిరతాజా।
తినకే కాజ సకలతుమ సాజా ॥

తాపసులకు రాజు అయిన శ్రీరామచంద్రమూర్తి అందరికంటె గొప్పవాడు. ఆ రాముని యొక్క సకల కార్యములును నీవే చేసి పెడతావు. నీవే సవరిస్తావు.

28. ఔర మనోరథ జో కోయీ లావై ।
    తాసు అమిత జీవన ఫలపావై ॥

ఎవరికైతే రకరకాలుగా కోరికలు కలిగి వుంటారో అవన్నీ నీ కృపతో నెరవేర్చుకోవటమే కాక, జీవన ఫలమైన మోక్షాన్ని కూడా పొందుతారు.

29. చారోయుగ పరితాప తుమ్హారా ।
    హై పరసిద్ధి జగత ఉజియారా ॥

నాలుగు యుగాలలో కూడా నీ ప్రతాముతో ప్రసిద్ధము చెందావు. నీ ప్రతాముచేత జగత్తు ఉజ్జ్వలమైనది.

30. సాధు సంతకే తుమ రఖవారే ।
    అసుర నికందన రామదులారే ॥

సాధు మహాత్ములకు నీవు రక్షకుడుగా వుంటావు. రాక్షసులను సంహరించి రామునికి ఆనందాన్ని కలిగించావు.

31. అష్టసిద్ధి నవనిధికే దాతా ।
    అసవర దీన్హా జానకీమాతా ॥

అష్ట సిద్ధులు నవ నిధులు నిన్ను నమ్మినవారికి యిస్తావని జానకీమాత నీకు వరమిచ్చినది.

32 రామ రసాయన తుమ్హారే పాసా ।
    సదా రహోతుమ రఘుపతికే దాసా ॥

నీ రామ నామ మహామంత్రమనే రసాయనం వున్నది. నీవు ఎప్పుడూ రామునికి దాసునిగా వున్నావు.

33. తుమ్హారే భజన రామకో భావై ।
    జనమ జనమకె దుఃఖ బిసరావై ॥

నీ భజన చేయటం శ్రీరామచంద్రునికి ఆనందదాయకము. తద్వారా జన్మజన్మల దుఃఖం దూరమైపోతుంది.

34. అంతకాల రఘుపతి పురజాయీ । జహాంజన్మి హరిభక్త కహాయీ

అట్టివారు ఎక్కడ పుట్టినా, ఎలా పుట్టినా హరి భక్తులు అని పిలువబడి అంత్యకాలంలో రఘునాధుని పురమైన వైకుంఠము చేరతారు.

35. ఔర దేవతా చిత్తన ధరయీ।
హనుమత సేయి సర్వ సుఖకరయీ॥
ఇతర దేవతలపై పోకుండా చిత్తమును హనుమ యందు నిలిపితే సర్వ సుఖములు చేకూరుతాయి.

36. సంకట హటై మిటై సబ పీరా।
జో సుమిరై హనుమత బలవీరా॥
బలవంతుడైన హనుమ నామస్మరణ వలన వలన సకల సంకటములు, పీడలు తొలగిపోతాయి.

37. జై జై జై హనుమాన గోసాయీ। కృపాకరో గురుదేవకి నాయీ
గురుదేవా! హనుమా!నీకు జయము! నా యందు నీ కృపను చూపు !

38. యహ శతవార పాఠకర జోయీ।
ఛూటహి బంధి మహా సుఖహోయీ॥
ఎవరు వందసార్లు హనుమాన్‌చాలీసా పఠిస్తారో వారికి సకల బంధనలు తొలగి, గొప్ప సుఖాన్ని పొందుతారు.

39. జో యహ్ పఢే హనుమాన్ చాలీసా।
హోయ సిద్ధి సాఖీ గౌరీశా॥
ఎవరైతే హనుమాన్ చాలీసా పఠిస్తారో వారు గౌరీశుల సాక్షిగా సిద్ధిని పొందుతారు.

40. తులసీదాస సదా హరిచేరా। కీజై నాథ హృదయ మహడేరా॥
నేను (తులసీదాస్) ఎల్లప్పుడూ హరిదాసుడనే. నా హృదయాన్నే మందిరంగా మలచుకో!

దోహా - పవనతనయ సంకట హరన। మంగళమూరతి రూప్।
రామ లఖన సీతాసహిత। హృదయ బసహు సురభూప్॥
పవన సుతుడవు అయిన హనుమా! సంకటములను పోగొట్టే స్వామీ! నీ హృదయంలో ఉన్న సీతారాముల సమేతంగా నా మనో మందిరంలో నిలచిపో!

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

ముని నిర్వికల్ప సమాధి యొక్కపరమానంద స్థితిలో వొక క్షణమున్నా లేక వేయి సంవత్సరాలువున్నా, అతను తిరిగి పునర్జన్మకు దారితీసే విషయ సుఖాలకై ప్రాకులాడడు. ఉద్దాలకుడు స్వేచ్ఛగా వింధ్య, హిమాలయ పర్వత శ్రేణి అరణ్యములో దట్టమైన పొదలలో, లోయలలో స్వేచ్ఛగా సంచరిస్తూ, ఎన్నో రోజులు నెలలు, సంవత్సరాలు గాఢమైన సమాధి స్థితిలో వుండి పోయేవాడు. అతను సంపూర్ణమైన ప్రశాంత స్థితిని చేరుకొని, జీవన్ముక్తుడయినాడు, ఆయన అనేక జనన, మరణ పరంపర నుండి ద్వారా వచ్చే దుఃఖాలు, సందేహాలు, సంశయాలు, బాధల నుండి విముక్తుడైనాడు.



నిర్వికల్ప సమాధి చాలా కాలం సాధన చేయటం వలన, ఉద్దాలకుడు తన మనస్సును చిత్ సమన్వయ స్థితిలో లయంచేసి, సత్య సమన్వయ స్థితిని సాధించాడు.

శ్రీరామచంద్రుడిలా ప్రశ్నించాడు, "పూజ్య గురుదేవా! సత్య సామాన్య స్థితిని గురించి, వివరంగా తెలియజేయవలసినది". వశిష్ఠ మహర్షి యిలా సమాధానం చెప్పాడు, సంకల్పములు లేక ఆలోచనలు సంపూర్తిగా నిర్మూలం చేసినప్పడు, మనస్సు సంపూర్ణమైన తెలివి స్వభావమును పొందుతుంది. ఆ స్వచ్ఛమైన ఆధ్యాత్మిక ఎరుకనే సత్య సమన్వయం మన్నారు.

సత్య సమన్వయం అంటే విశ్వ వ్యాపకత్వము, అది తురియాతీతమైన స్థితి. కర్పూరం అగ్నిలో కరిగిపోయేట్లు, మనసు పవిత్రమైన ఎరుకలో లయమవుతుంది. అప్పడు బాహ్య వస్తువులు అంతర్గత వస్తువులు, వాతావరణము, అన్నీ అదృశ్యమవుతాయి, అదే సత్య సమన్వయం. జ్ఞాని లేక జీవన్ముక్తుని ఆధ్యాత్మిక లేక ఆత్మ దర్శనమే సత్య సమన్వయం. ఏదైనా అలికిడి వినపడగనే, తాబేలు తన అవయవాలన్నిటిని, తనకవచము వంటి పైడిప్పలో ముడుచుకొన్నట్లు జ్ఞాని లేక ఋషి, విషయాలు బాహ్యాకర్షణలు ప్రత్యక్షం కాగానే వారి

దృష్టి అంతర్ముఖమవుతుంది. బాహ్య ప్రపంచము, విషయ వాసనలను గురించిన, ఆలోచనలే వుండవు, వాటి ప్రభావమతనిపై కించిత్తైనా వుండదు, అదే సత్య సమన్వయం.

జ్ఞానము, వివేచనా శక్తి వలన, నిర్వికల్ప సమాధిని పొందిన జీవన్ముక్తుడు మాత్రమే, సత్య సమన్వయమనే దివ్య దర్శనమును మాత్రమే ఆనందిస్తాడు. చాలా కాలము తర్వాత, ఉద్దాలకుడు తన భౌతిక దేహమును భూమిపై త్యజించి విదేహ ముక్తిని పొందాలనుకొన్నాడు. వెంటనే పద్మాసనాశీనుడై అర్థ నిమీలిత నేత్రాలతో, తన నవరంధ్రాలను మూసివేసుకొని, తన యింద్రియాలనదుపులో పెట్టుకొన్నాడు, తన శిరస్సు, కంఠము, మధ్య భాగము నిటారుగా వుంచి, ప్రాణ వాయువును, నిగ్రహించాడు. తన నాలుక కొసను, నోటిపై పేటిక కప్పపై నిలిపి, ఖేచరీ ముద్రను సాధనచేశాడు, తన పై పలువరుసను, క్రింది పలువరుసను గట్టిగా బిగించాడు, అప్పడు శ్వాస పూర్తిగా నిలిపివేశాడు.

అతని వదనము చాలా ప్రశాంతంగా, స్వచ్ఛంగా వున్నది, అతనికి యేకత్వము యొుక్క దివ్య దర్శనము లభించింది, అతను బ్రహ్మానందమనే సాగరములో పూర్తిగా మునిగిపోయాడు. అతని ముఖము నవ వికసిత కమలములా భాసించింది. జ్యోతులకు జ్యోతైన దివ్య జ్యోతిలో లయమైనాడు. అలా విదేహ ముక్తిని పొందాడు, అలా నిరంతరమైన, ఆత్మ విచారణ ద్వారా నిర్వికల్ప సమాధిని పొందినవాడు, బ్రహ్మానంద భూతిలో వోలలాడుతాడు, అని ముగించాడు.

- సశేషం

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఏప్రియల్ 2016, మే 2016 ల లో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

మే 2016 : AS5922, 5960, 6388, 6390, 6391, 6613, 6866, 7120, 7121, AS7122, 7123, 7126.

జూన్ 2016 : AS 4750, 6395, 6143, 6398, 7129, 7131, 7132.

– మేనేజర్

# మంచిని పెంచు

సేకరణ - వంకిన బాబు

కారు ఆగిపోయింది. అందులో నుండి దిగిన ఆమెకు 50సంవత్సరాలు ఉంటాయి. ఆమె పేరు నిర్మల. దిగి చూసింది టైర్ పంక్చర్ అయింది. స్టేఫినీ ఉంది కాని తనకు వెయ్యటం రాదు. రోడ్డు ప్రక్కకు తీసి సహాయం కోసం చూస్తోంది. ఒక్కరూ ఆగటం లేదు. సమయం చూస్తే సాయంత్రం 6గంటలు అవుతోంది. చీకటి పడుతోంది. మనస్సులో ఆందోళన. ఒక్కర్తే ఉంది. దగ్గరలో ఇళ్ళు లేవు. సెల్ ఫోన్‌లో సిగ్నల్ లేదు. ఎవరూ కారునూ, ప్రక్కనే ఉన్న ఆమెను చూసినా కూడా ఆగటం లేదు. భయం వేస్తోంది.

ఇంతలో అటుగా వెడుతున్న ఒక పాతకారు ముందుకు వెళ్ళి పక్కకు తిప్పి వెనక్కు వచ్చింది. అందులో నుఇుడి ఒక వ్యక్తి దిగాడు. అతడు తన దగ్గరగా రావటం చూసి బెదిరిపోయి ఎందుకు ఇలా వస్తున్నాడో అని నిర్మల అందోళన చెందినది.

అతను టైర్‌లో గాలి లేదని గమనించాడు. నవ్వుతూ దగ్గరకి వచ్చాడు. ఆమె బెదిరిపోతోందని గ్రహించి, “భయపడకండి. నా పేరు డేవిడ్. నేను ప్రక్కనే మెకానిక్ షాప్‌లో పనిచేస్తాను. మీకు సహాయం చేద్దామనే వచ్చాను. మీరు కారులో కూర్చోండి. నేను స్టెప్నీ మారుస్తాను” అని చెప్పి అతను డిక్కీ తెరచి, కావలసిన సామాను తీసుకుని, కారు క్రిందకు దూరి జాకీ బిగించాడు. తారురోడ్డు గీసుకుని, చేతులు రక్తం కారాయి. జాకీ బిగించి, టైర్లు తీసి టైర్లు మార్చాడు. సామాను తిరిగి కారులో పెట్టాడు డేవిడ్.

నిర్మల డబ్బులు తీసి యివ్వబోయింది. డేవిడ్ ‘వద్దు’ అన్నాడు. ‘ఎంతైనా యిస్తాను. మీరు కనుక కనబడి యీ సహాయం చెయ్యకపోతే, నా పరిస్థితిని తలచుకుంటే నాకు భయం వేస్తోంది’ అన్నది నిర్మల.

‘నేను ఇలాంటి పరిస్థితిలో వున్నప్పుడు, కష్టాల్లో వున్నప్పుడు ఎందరో సహాయపడ్డారు. మీకు సహాయం చేయాలనిపిస్తే, ఎవరైనా కష్టాల్లో వున్నారని మీకు అనిపించినప్పుడు నా పేరు తలచుకుని మీరు వారికి సహాయం చేయండి’ అని వెళ్ళిపోయాడు డేవిడ్.

అతనికి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ నిర్మల కారు నడుపుకుంటూ వెడుతోంది. అప్పుడామెకు ఆకలి గుర్తుకు వచ్చింది. తను వెళ్ళవలసిన దూరం చాలా వుంది. ఆకలి, చలి ఆమెను రోడ్డు ప్రక్కన వున్న హెూటల్‌కి వెళ్ళేలా చేశాయి. .......

అదొక చిన్న హెూటల్. కష్టమర్స్ టేబల్ దగ్గరకి మేరీ అనే ఒక గర్భిణి మహిళ సర్వ్ చేస్తోంది. ఆమెను చూస్తుంటే నిండు గర్భిణి అనిపించింది. డెలివరి రోజులు దగ్గరకి వచ్చివుంటాయి అనిపించింది. బరువుగా నడుస్తోంది. అన్ని టేబుల్స్ దగ్గరకి వెళ్ళి కావలసినవి ఆర్డర్ చేసుకోవటం, సర్వ్ చేయటం బిల్లు తీసుకుని చిల్లర యివ్వటం అన్నీ ఆమే చేస్తోంది. అయినా ఆమె ముఖంలో చెరగని ప్రశాంతమైన చిరునవ్వు వెలిసింది. మేరీ, నిర్మల టేబల్ దగ్గరకు వచ్చింది. చిరునవ్వుతో ఏమి కావాలండీ? అని అడిగింది. అంత శ్రమ పడుతున్నా చెరగని చిరునవ్వు ఆమె ముఖంలో ఎలా వుందో? అని ఆశ్చర్యపోతోంది నిర్మల మనస్సులో. భోజనం ఆర్డర్ ఇచ్చింది. భోజనం చేసి మేరీకు 1000 నోటు యిచ్చింది. మేరీ చిల్లర తేవటానికి వెళ్ళింది. తిరిగి వచ్చేసరికి నిర్మల కనబడలేదు. నిర్మల కూర్చున్న టేబల్ మీద వున్న గ్లాసు క్రింద ఒక కాగితం, దానిక్రింద నాలుగు వెయ్యి రూపాయల నోట్లు వున్నాయి. ఆ కాగితం చదివిన ఆ హెూటల్ మెయిడ్ మేరీ కన్నీరు ఆగలేదు.

అందులో యిలా వున్నది ..... "చిరునవ్వుతో వున్న నీ ముఖం నీకు బాధలు లేవేమో అన్నట్లున్నది. నువ్వు నిండునెలలతో పని చేస్తున్నావు అంటే నీకు డబ్బు అవసరం అనిపిస్తోంది. నాకు ఒక మిత్రుడు సహాయ పడినట్లే అతనిని తలచుకుంటూ నేను నీకు సహాయపడుతున్నాను. ఈ గొలుసు ఇంతటితో తెగిపోకూడదు. నీవూ యితరులకు సహాయపడు" అని వ్రాసి వున్నది.

మేరీ ఇంటికి వచ్చి అలసిపోయి పడుకున్న భర్త డేవిడ్ చేతికేసి చూసింది. గీసుకుపోయిన చేతులు రక్తం గడ్డకట్టినట్లుంది. అతని ప్రక్కన మంచం మీదకు చేరుతూ "మనం బెంగ పెట్టుకున్నాం కదా. డెలివరీ ఎలాగ అని. ఇక ఆ బెంగ తీరిపోయింది లే డేవిడ్! భగవంతుడే మనకు సహాయం చేశాడు. ఆయనకు కృతజ్ఞతలు" అన్నది మేరీ.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

మే 2016

02 సోమ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

05 గురు : మాసశివరాత్రి , పావులూరు శాఖలో ఏకాహం

06 శని : అమావాస్య

09 సోమ : అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ.

11 బుధ : శ్రీశంకరాచార్య జయంతి, శ్రీసద్గురు ఏక వింశతి వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

21 శని : వైశాఖ పౌర్ణమి, శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

26 గురు : వైశాఖ బహుళ పంచమి- శ్రీమహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా మహోత్సవము, లీలా కళ్యాణము.

31 మంగ : శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

జూన్ 2016

05 ఆది : అమావాస్య.

13 సోమ : జేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణ ప్రసాద మాతాజీ వారి నవమ వార్షికారాధన

18 శని : శని త్రయోదశి

20 సోమ : జేష్ఠ పౌర్ణమి, శ్రీ సద్గురు పాద పూజ.

29 బుధ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

"ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నా, లేక సాధరణ జీవనం గడుపుతున్నా 'నేను ఏమి సాధించాను?' అని ప్రశ్నించుకుని, ఏమీ సాధించలేక పోయానని బాధపడటం కన్నా, తాను ఏ రకమైన దుష్కృత కర్మము మూటకట్టని వాడు ధన్యుడు. మరి మానవుడు కోరుకునే ప్రశాంతత బాహ్య ప్రపంచంతో గల సంబంధ బాంధవ్యాలను తెగ తెంపులు చేసుకుంటే పొందగలుగుతాడా? అసంభవం" అన్నారు సద్గురుదేవులు.



మరి నిజమైన ప్రశాంతతను ఎలా పొంద గలుగుతాడు? అది మానసికమైనది. ప్రశాంతతకి అవరోధాలు మానసిక అస్థిరత. అది జన్మాంతర వాసన. మానవునిలో దాగి దివ్యత్వాన్ని మరుగు పరిచేది యీ వాసనే. అది మనస్సుని ప్రభావితం చేసి మనస్సులో సంకల్పాలకు, భావనలకు ఆధార మవుతోంది. సాధకుడు వాసనని రహితం చేసుకునే మార్గంలో పయనిస్తే తప్ప మానసిక ప్రశాంతత అసంభవం. అంతేకాదు మనస్సులో కలిగే సంకల్పాలు త్రిగుణాత్మకంగా ఉంటాయి.

సాత్వికమైన భావనలు గాని, సంకల్పాలుగాని ధర్మబద్ధంగాను, నియమితమైనవిగాను, సూక్ష్మాతిసూక్ష్మంగాను ఉంటాయి. కాని రజోగుణ ప్రధానమైన మనస్సులో భావనలు, సంకల్పాలు వుద్రేక పూరితంగా, మనుస్సను ఆందోళన పరచేవిగా, ఆశామోహాలతో కూడి వుంటాయి. తమో గుణ ప్రధానమైన మనస్సు స్థిరమైన భావాలు లేనిదిగా సోమరితనముతో కూడినదిగా సాత్వికము, సరళత్వము లోపించినదిగా ఉంటుంది.

మానవుని మనస్సు బుద్ధి సత్వ రజో తమో గుణాల ప్రభావానికి కట్టుబడి ఉంటాయి. మనస్సు భావనలకు, సంకల్పాలకు నిలయమైతే బుద్ధి నిర్ణయాత్మకమైనది, విశ్లేషణాత్మకమైనది.

బుద్ధి రెండు విధాలుగా తన విధులను నిర్వర్తిస్తుంది. ప్రాపంచిక విషయాదులవైపు మళ్ళిస్తే అది స్థూలబుద్ధిగాను, ఆధ్యాత్మికపరంగా

వినియోగిస్తే సూక్ష్మాతి సూక్ష్మంగాను తన నిర్ణయాన్ని ధృవీకరిస్తుంది. స్థూలబుద్ధి రజో తమోగుణాలకు లోబడి వివేకవంతమైన నిర్ణయాలను నిత్యానిత్య వస్తు వివేకాన్ని ప్రతిబింబించలేదు. సూక్ష్మ బుద్ధి ఆత్మానాత్మవివేకము కలిగి ఉంటుంది.

మానసిక ప్రశాంతతను సాధించాలంటే సద్గురుమూర్తి సమాశ్రయం లేనిదే అసంభవము. మానవునిలోని జీవలక్షణాలైన జనన మరణాలు, ఆకలిదప్పులు, రాగద్వేషాలు, జన్మపరంపరకు తీసుకువస్తాయి. జీవత్వానికి మూలము అవిద్య లేక అజ్ఞానము. అది సూక్ష్మాతిసూక్ష్మంగా దాగివుండి పునర్జన్మకి కారణమవుతుంది. సాధకుడు సమర్థుడైన సద్గురువును ఆశ్రయించి, ఆయన ప్రసాదించిన లక్ష్యార్థ సాధనద్వారా భావనాపరంపరలతో కూడిన అస్థిరమానసిక స్థితిని అధిగమించి జనన మరణ విషవలయం నుండి విముక్తిపొంది శాశ్వతానంద స్థితిని పొందక తప్పదు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

మే 2016

02 సోమ : శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ

11 బుధ : శ్రీశంకరాచార్య జయంతి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

21 శని : వైశాఖ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

31 మంగ : శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - ఉదయం 10గం.లకు ఆకుపూజ; శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

జూన్ 2016

20 సోమ : జేష్ఠ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

29 బుధ : శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

# విందు

యమ్. సింహాచలం

రావణ సంహారానంతరం శ్రీరాముడు సీతా, లక్ష్మణ సమేతుడై అయోధ్యకు తిరిగివచ్చి, పట్టాభిషిక్తుడయ్యాడు. ఆ సమయంలో జనక మహారాజు రాముణ్ణి ఉద్దేశించి, “రామా! సీతను చెరను విడిపించటంలో ఎన్నో శ్రమలకు లోనై సహాయపడిన వానరులకు విందు చేయాలని సంకల్పం కలిగింది. వారిని వెంటనిడుకుని మిథిలకు తరలి రావలసినది” అన్నాడు. శ్రీరాముడు చకితుడయ్యాడు. వానరులు చంచల స్వభావులు ఎక్కడ ఎలా ప్రవర్తించాలో తెలియని అమాయకులు. ఆ విందు సమయంలో ఏం వెకిలి చేష్టలు చేస్తారో అని భయపడి తన సంశయాన్ని జనకమహారాజుకు తెలియజేశాడు.

జనకుడు రాముని సందేహాన్ని నివారిస్తూ “వానరులు సజ్జనులు. కావునే నీకు సహాయపడ్డారు. అట్టివారు అనాగరికంగా ప్రవర్తిస్తారని నేను అనుకోను. నా అభ్యర్థనను తిరస్కరించవద్దు. మీరు వానర సమేతంగా మిథిలకు రావలసినదే” అన్నాడు. జనకుని మాటకు రాముడు సరే అనక తప్పలేదు.

వానరులంతా రాముని వెంట మిథిలకు చేరుకున్నారు. వారంతా రాముని ఆజ్ఞ ప్రకారం వినయ విధేయతలతో జనకునికి పాదాభివందనం చేశారు. వారి వినయ సంస్కారాలకు మురిసిపోయి జనకుడు ‘నేను చెప్పలేదా?’ అన్నట్లుగా రామునివైపు చూశాడు. రాముడు చిరునవ్వు నవ్వాడు. విందు వడ్డన ప్రారంభమైంది. వానరులంతా బారులు తీరి కూర్చున్నారు. రకరకాల రుచ్య పదార్థాలతో విస్తళ్ళు నిండాయి. వానరులు భుజించటానికి ఉపక్రమించారు.

జనకుడు రామసమేతుడై ఒక మందిరంలో కూర్చుని ఇష్టాగోష్టి సల్పుతున్నాడు. ఆ గోష్టిలో వానరుల ప్రభుభక్తిని, సౌశీల్యాన్ని, నాగరిక ప్రవర్తనను గురించి శ్లాఘిస్తున్నాడు. శ్రీరాముడు మందహాసంతో జనకుని మాటలు వింటున్నాడు. బయట నుండి ఏదో కలకలం వినిపించింది. ఇంతలో వడ్డనకాండ్రు పరుగెత్తుకుంటూ ఆ మందిరంలో ప్రవేశించి, వగరుస్తూ “ప్రభూ! మీరు త్వరగా రావాలి. ఆ కోతిమూకను ఆపటం మా తరం కాదు” అన్నారు.

జనకుడు వెలాతెలా బోయాడు. రాముడు చిరునవ్వుతో వడ్డన శాలకు బయలుదేరాడు. జనకుడు కూడా అనుసరించాడు.

ఓహో! ఏమి దృశ్యం! విస్తళ్ళముందు కూర్చున్న కోతులు ఒకదానిని మించి యింకొకటి పైకెగురుతూ క్రిందకూలబడుతున్నాయి. ప్రగల్భాలు పలుకుతున్నాయి. పరుషాలాడుకుంటున్నాయి. ఎత్తు ఎగరటంలో గెలిచిన కోతిచేత ఓడిన కోతి మొట్టికాయలు తింటున్నది. అయినా అవి ఎగరటం మానలేదు. ప్రతాప ప్రదర్శనలో తలమునకలై పోయిన ఆ వానర వీరులు రాముని రాకను కూడా గమనించకుండా వారి చేష్టలను కొనసాగిస్తున్నారు.

రాముడు గద్దించాడు "ఆగండి!" ఆ మేఘ గర్జన స్వరాన్ని గుర్తించిన ఆ వానరులు మైకం వీడి, ఎగరటం ఆపి, బుద్ధిశాలురలవలె విస్తళ్ళవైపుకు తలలు వాల్చి భోజనానికి ఉపక్రమించారు.

విందు ముగిశాక రాముడు వానర వీరులను పిలిపించి, వారి అసభ్య ప్రవర్తనకు కారణం అడిగాడు. ప్రతి కోతి, 'తనదేమీ తప్పులేదనీ, తన ప్రక్కవానిదే తప్పనీ, పైకి ఎగరటంలో తనను మించినది లేదని ఎగిరి వెక్కిరించటం వల్లనే నేను కూడా ఎగిరాననీ, తను నిర్దోషిననీ, తప్పంతా తన ప్రక్కకోతిదే'ననీ నెపం ఆరోపించింది. తుదకు పంక్తి మొదట కూర్చున్న కోతి ఎగరటానికి కారణం ఏమిటో అర్థం కాలేదు. అది ఎగిరేందుకు ప్రక్కన కోతి లేదు కదా మరి!

ఆ కోతిని పిలిచి 'కారణం ఏమిచెబుతావు?' అన్నాడు రాముడు. ప్రాయంలో చిన్నవాడైన ఆ వానరవీరుడు గజగజలాడిపోతూ "రామప్రభో! నా దోషం ఏమీ లేదు. నేను భుజిస్తుండగా, పులుసులోని చింతగింజ నా చేతి నుండి జారి పైకి ఎగిరింది. జీవం లేని చింతగింజ పొగరెక్కి నన్ను కవ్విస్తే నేనెలా సహించను? దానిని మించి పైకెగెరాను. అంతేతప్ప నేనెవరినీ కవ్వించలేదు" అంటూ దీనవదనంతో శిరస్సు వాల్చాడు.

అక్కడ ఉన్నవారంతా గొల్లున నవ్వారు. రాముడు, సిగ్గుతో తల వాల్చిన ఆ అమాయక వానరవీరుని చెక్కిలి నిమిరి, ఆనందపరచాడు. జనకుని విందు భోజనం కంటె శ్రీరాముని వాత్సల్యరసం ఆ వానరులకు మిక్కిలి విందు గొలిపింది.

జై శ్రీరామ్!

# దేవుడు

- పెనుమాక నాగేశ్వరరావు

విరబూసిన పూ పరిమళానివి
విరగాసిన వెన్నెల సౌరభానివి
పసిపాపల హృదయాకాశానివి

వసి వాడని చైతన్యానివి
నిదురించని నిశ్శబ్దానివి
మాటలకందని భావానివి

సత్యానికి సంకేతానివి
జగమెరుగని సత్యానివి
నిజమెరిగిన సాక్ష్యానివి

అలుపెరుగని కాలానివి
ఆద్యంతాలకు మూలానివి
మా మూలాలెరిగిన వనమాలివి.



# శ్రీకృష్ణ కర్ణామృతము

(గత సంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

ద్వితీయాశ్వాసము 34వ శ్లో॥

మా యాత పాన్థాః పథిభీమరథ్యాః దిగమ్బరః కోఽపి ।

విన్యస్త హస్తోపి నితమ్బ బిమ్బే ధూర్త సమాకర్షతి చిత్తవిత్తమ్ ॥

తాత్పర్యము -



ఓ బాటసారులారా! భీమరథి అనే నది యొుక్క త్రోవ యందు వెళ్ళకుడు. అక్కడ కానుగువలె నల్లని వాడు ఎవడో దిసమొలతో వున్న ఒక టక్కరి, మొల యందు వుంచుకోబడిన చేతులగల వాడు మానస ధనమును అపహరించుచున్నాడు.

చల్లలమ్ముకోవడానికి కొందరు గోప కాంతలు మధురానగరికి వెడుతుండగా, దారి తెలియక తికమకపడుతున్న బాటసారులు కొంతమంది వారిని త్రోవ చూపించమని అడిగారు. వెంటనే వాళ్ళు "అయ్యా! బాటసారులారా! భీమరథిమార్గాన మాత్రం వెళ్ళకండి. అక్కడ ఒక దొంగ ఉన్నాడు. దిసమొలతో ఉంటాడు. చేతులు రొండినే పెట్టుకుని ఉంటాడు. మనో ధనములను బహు చమత్కారంతో దొంగిలిస్తుంటాడు" అని చెప్పారు.

అలా తను మనో ధనాలను దొంగిలించి మోక్ష మార్గాన్ని చూపిస్తాడు వాడు. వాడినే నమ్మండి!

# రుద్రాక్ష మహిమ

- రావి శోభ

ఒకనాడు గిరిజాదేవి నీలకంఠుణ్ణి సమీపించి, “నాథా! మీరు సుగంధపరిమళాలు వెదజల్లే పూలు ఎన్ని ఉన్నా, ఎక్కువగా రుద్రాక్ష మాలనే ధరించటానికి యిష్టపడతారు. దానికి నిగూఢమైన అర్థం ఏదో ఉండే ఉంటుంది. దయచేసి దాని గురించి వివరించవలసినది అని వేడుతున్నాను” అన్న పర్వతరాజ తనయతో హరుడు తాను ధరించిన మాలలోని ఒక రుద్రాక్షను తీసి, ఆదిశక్తికి అందిస్తూ, ‘దేవీ! కుబేరుని నగరానికి వెళ్ళి దీనికి సమానమైన అమూల్యమైన దానిని తీసుకురా. అప్పుడు నీకే అర్థం అవుతుంద’ని ఆదేశించగా అంబికాదేవి కుబేరుని నగరమైన అలకాపురికి పయనమై వెళ్ళింది.

గౌరీదేవి ఆగమనాన్ని గుర్తించిన కుబేరుడు స్వయంగా ఎదురు వెళ్ళి జగన్మాతను సాదరంగా ఆహ్వానించి, సముచిత ఆసనంపై, అర్ఘ్య పాద్యాదులతో పూజించి, వినయంతో ‘ఈ రోజు మీ దివ్యమంగళ విగ్రహ దర్శన భాగ్యాన్ని కలిగించారు. నేను చేయవలసిన పనిఏమిటో శెలవివ్వండి’ అని అడుగుతున్న కుబేరునితో తన చేతిలోని రుద్రాక్షని అందిస్తూ “నాయనా! కుబేరా! నా నాథుడు దీనితో సరితూగు అమూల్య మైన సంపదని తీసుకురావలసినదిగా ఆజ్ఞాపించారు” అంటున్న దేవి మాటలకు ఆశ్చర్యచకితుడై, వెనువెంటనే మాయా ప్రభావమున ఒక్కింత గర్వముతో అలాగే మాతా రండి అంటూ పరమేశ్వరిని తన సంపద నవనిధులు ఉండేచోటుకు తీసుకువెళ్ళి బంగారు పీఠం వేసి ఆమెని ఆసీనురాలిని చేశాడు.

ఆమె ఎదురుగా ఒక బంగారు త్రాసుని ఉంచి, శివుని ప్రతి రూపంగా భాసిల్లే ‘రుద్రాక్ష’ని ఒకవైపు, మరోవైపు వజ్ర వైఢూర్యాలు, మరకత, మాణిక్యాలు, కెంపులు వంటివి రాసులుగా పోసి ఆ త్రాసులో తూచాడు. కాని త్రాసులో ఎటువంటి మార్పురాలేదు. కుబేరుడు ఆశ్చర్యపోయి యీసారి వివిధ ఆభరణాలు నింపిన బంగారు పెట్టెలు త్రాసులో నిండుగా పెట్టినా ‘రుద్రాక్ష’ ఉంచిన పళ్ళెం రవ్వంతైనా కదలలేదు. ఈ దృశ్యాన్ని చూస్తున్న కుబేరుని మొహంపై పూర్వం ఉన్న గర్వానికి బదులుగా చిన్నగా భయంతో నిండిన ఆశ్చర్యం తొణికిసలాడింది.

ధనాధిపతి అయిన తాను నిరంతరం శివపూజాదురంధరుడు, శివునికి పరమమిత్రుడు, శివానుగ్రహం పొందిన కారణంగా మదిలో ఒక మూల చిన్నపాటి గర్వం ఉండటం వలనే సాక్షాత్ ఆ కైలాసనాధుడే తనను పరీక్షించాడని గ్రహించి, పశ్చాత్తాపంతో నిలకడగా మదినిండా స్వామినే నిలుపుకుని, ఆ త్రాసు ఎదుటనే సాష్టాంగ పడగా, చిరు మందహాస వదనంతో నిరంతర అభయప్రదాత అయిన నీలకంఠుడు కుబేరుని ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

కుబేరుడు శివునితో "అమ్మ పార్వతీదేవి రాక అమిత ఆనందాన్నిచ్చింది. నూతన బలాన్ని పెంపొందించింది. అయితే మీ ఆజ్ఞగా 'రుద్రాక్ష'కు సరితూగు అమూల్య సంపద అనగానే నా మదిలో అహంకారంతో యీ చిన్న రుద్రాక్షకు ఏం వస్తుందనే భావం మొదలైంది. కానీ దానిశక్తి ఎంతటిదో త్రాసులో ఉంచితేగాని నాకు తెలియరాలేదు. కనుక ఈ అపరాధ భావనని క్షమించి నన్ను మన్నించు మహాదేవా!" అంటూ పాదాలపైపడి ప్రాధేయపడుతున్న కుబేరునికి అభయమిచ్చి సర్వలోకాలకు 'ఆ శక్తి' గొప్పతనం తెలియజేయుటమే పరమావధి అవుతున్నది. ఎల్లప్పుడూ 'శరణాగతి' అన్న సంపదే ప్రతివానికి 'అమూల్య సంపద'గా భావించాలని కుబేరునికి హితవాక్యాలు ప్రబోధించి పరమేశ్వరుడు పార్వతీదేవితో కైలాసానికి చేరుకున్నాడు. 'రుద్రాక్ష' మహిమను ప్రపంచానికి తెలియజేయటానికే సదాశివుడు సంకల్పించిన అద్భుత లీల!


## వేసవిలో శిక్షణా తరగతులు!

మే 1వ తేదీ నుండి మే 30వ తేదీ వరకు వరకు శ్రీకాళీగార్డెన్స్ నంబూరులో చిన్నపిల్లలకు వేసవి శిక్షణా తరగతులు ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు అంశాలలో నిర్వహింప బడుతున్నాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి సద్వినియోగ పరచుకోగరు!

వివరములకు డా.అరుణ. సెల్ నం. 9346382563

(గత సంచిక తరువాయి) **గీతాధ్యయనమ్** - రమణ ప్రసాద్

## 14. గుణత్రయ విభాగయోగము

ప్రకృతి జనితములగు సత్వరజస్తమో గుణాలు జీవుని ఉచ్ఛ నీచ జన్మలకు హేతువులు. ఆ గుణముల వివరాలు తెలిసికోవాలని అవి ఏ విధంగా జీవుని బంధిస్తాయో వాటి గురించి తెలుసుకోవాలని అభిలాష ఉంటుంది. ఆ గుణముల గురించి భగవానుడే స్వయంగా వివరించాడు.



"అర్జునా! దేనిని తెలిసికొని మునులందరూ సంసార బంధనాల నుండి విడువడి మోక్షస్థితిని పొందారో అట్టి ఉత్తమమైన జ్ఞానమును నేను నీకు చెబుతున్నాను."

సర్వయోనిషు కౌంతేయ! మూర్తయ స్సంభవన్తి యాః ।
తాసాం బ్రహ్మ మహద్యోనిః । అహం బీజప్రదః పితా ॥ 4

అన్ని యోనులలోను ఆవిర్భవిస్తున్న శరీరాలకు మూల ప్రకృతి తల్లి. నేను బీజం యిచ్చెడి తండ్రిని.

సత్త్వం రజస్తమ ఇతి । గుణాః ప్రకృతి సంభవాః ।
నిభధ్నంతి మహాబాహో । దేహే దేహిన మవ్యయమ్ ॥ 5

"అర్జునా! ప్రకృతి వలన పుట్టిన సత్త్వరజస్తమో గుణాలు మూడూ ఆత్మను దేహమందు బంధిస్తున్నాయి. సత్త్వగుణము నిర్మలమైనది, ప్రకాశమును కలుగజేయునది. ఇది సుఖాసక్తిచేత, జ్ఞానాసక్తి చేత జీవుని బంధిస్తోంది. రజోగుణం దృశ్యవిషయాల యందు ప్రీతిని కలుగుజేస్తుంది. ఆశయే ఆసక్తికి మూలం. తమో గుణం అజ్ఞానం వల్ల జనిస్తుంది. పరాకు, బద్ధకం, నిద్రాదులతో కూడి ఆత్మను బంధిస్తోంది.

రజో, తమో గుణాలను అణిచిపెట్టి సత్త్వగుణం; సత్త్వ తమో గుణాలను అణిచి రజోగుణం, సత్త్వ రజో గుణాలను అణిచిపెట్టి తమోగుణం వర్ధిల్లుతాయి.

సత్త్వగుణం వల్ల జ్ఞానము, సాత్వికత వెల్లివెరుస్తాయి. సత్వంగుణం అభివృద్ధి చెందినప్పుడు మరణించినవాడు ఉత్తమలోకాలు పొందుతాడు. రజో గుణం వల్ల కర్మలపట్ల ఆసక్తి, అశాంతి, ఆశ పెరుగుతాయి. రజో

గుణం ప్రబలినప్పుడు మరణించిన వాడు కర్మలపై ఆసక్తిగలవాడుగా జన్మిస్తాడు. తమోగుణం వల్ల బద్ధకం, అలక్ష్యం, అజ్ఞానం కలుగుతాయి. తమోగుణం వృద్ధిలో వున్నప్పుడు మరణించినవాడు పామరులకు, పశు పక్ష్యాదులకు జన్మిస్తాడు.

కర్మలన్నిటికీ గుణాలను తప్ప మరొకదానిని కర్తగా భావించకుండా, గుణాలకు అతీతమైన పరమాత్మ తత్త్వాన్ని గ్రహించినవాడు మోక్షం పొందుతాడు. ఈ మూడు గుణాలను అధిగమించినవాడు జనన మరణాల నుండి ముక్తుడై అమృత పదాన్ని పొందుతాడు.

అర్జునుడు - ఈ మూడు గుణాలు దాటినవాడి ప్రవర్తన ఎలా ఉంటుంది?

భగవానుడు - తనకు సంప్రాప్తించిన సత్వగుణ సంబంధిత సౌఖ్యంగాని, రజోగుణ సంబంధమైన కర్మ ప్రవృత్తినిగాని, తమోగుణ లక్షణమైన మోహాన్నిగాని ద్వేషింపడు, వాటిని ఆకాంక్షించడు. ఏమి చలించకుండా 'సర్వకార్యాలలో ప్రకృతి గుణాలే వర్తిల్లుతున్నాయి' అనే నిశ్చల బుద్ధిని కలిగి ఉంటాడు.

బహ్మణో హి ప్రతిష్ఠాహం । అమృతస్యావ్యయస్య చ ।
శాశ్వతస్య చ ధర్మస్య । సుఖస్యైకాంతి కస్య చ ॥ 27

నేను అవ్యయమునకు, స్వరూపానికి, అటులనే వినాశ రహితం, వికార రహితం, ధర్మస్వరూపానికి ఐకాంతిక సుఖానికి కారకుడైన బ్రహ్మను నేనే!

ఎవరు గొప్ప ? ఈశ్వరుడా? భక్తుడా?

సముద్రం గొప్ప అందామా?
సముద్రం భూమిలో అణిగి వుంది !
భూమి గొప్ప అందామా?
భూమిని శేషుడు మోస్తున్నాడు !
శేషుడు గొప్ప అందామా?
శేషుడు పార్వతీదేవికి అలంకారమై వున్నాడు !
పార్వతి గొప్ప అందామా?
పార్వతి ఈశ్వరునిలో అర్థశరీరమై వుంది !
ఈశ్వరుడు గొప్ప అందామా?
ఈశ్వరుడు భక్తుని హృదయంలో అణిగి వున్నాడు !
భక్తుడా, ఈశ్వరుడా ఎవరు గొప్ప ?

# అత్రి మహర్షి

- రమణ ప్రసాద్

అత్రి మహర్షి సప్త మహర్షులలో ఒకడు. అనసూయ మహాసాధ్వికి భర్త. మహా తపసంపన్నుడు. సృష్టి కార్యములో తనకు సహాయం చేసేందుకు బ్రహ్మదేవుడు అత్రిని పుట్టించాడు. బ్రహ్మదేవుడు అత్రితో," నువ్వు తపస్సు చేసి లోక సంరక్షణ కొరకు కొందరని సృజింపవలెను'' అనగా అత్రి అంద్రి ఆజ్ఞానుసారంగా తపస్సు చేయ నారంభించాడు. నశ్వరమగునది దేహం అని, శాశ్వత మైనది ఆత్మ అని తెలుసుకోవటానికే యమ నియమాలు, తపోవ్రతాలు ఏర్పడ్డాయి. దేహంపై మమత్వం నశింపచేయటంకోసం కఠిన నియమాలతో శరీరాన్ని తపింపచేసి, యాత్మానందస్థితి పొందినవారే మహర్షులు. ఆ స్థితిని పొందటానికి నిత్య తపోనిరతియే మార్గము. ఆ స్థితిని పొందటం కోసమే అత్రి తపస్సు చేస్తున్నాడు. అతడు చేసే మహోగ్ర మైన తపస్సు చేత అతని నేత్ర గోళాలనుండి ఒక దివ్య తేజస్సు భువనభువాంతరాళాలకు వ్యాపించి సముద్రంలో పడింది. బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చి, ఆ తేజమును తాను ధరించి తన అంశంతో అత్రికి చంద్రుడిగా పుడ్తానని చెప్పాడు.




కొంత కాలానికి దేవహూతీ కర్దములకు విష్ణుమూర్తి కటాక్షంతో తొమ్మిది మంది కుమార్తెలు, ఒక కుమారుడు జన్మించారు. కర్దమ ప్రజాపతి తన కుమార్తెలను బ్రహ్మర్షులకే ఇచ్చి వివాహంచేయటానికి నిశ్చయించినవాడై, అత్రికి తన కూతురైన అనసూయను ఇచ్చి వివాహం చేశాడు. వివాహనంతరం సతీ సమేతంగా అత్రి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

అనసూయ తన భర్తనే తన దైవంగా ఎంచి అతనికి సకలోపచారాలు చేస్తూ, జ్ఞానోపదేశము అతని వలన పొంది మహాసాధ్విగా పేరు పొందినది. ఆమె గొప్పతనము రోజు రోజుకీ పెరుగుతుంటే, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అనసూయ మహాత్మ్యమును పరీక్షించటానికి వచ్చి వారి ఆతిథ్యాన్ని కోరారు. అత్రి అది తన సౌభాగ్యంగా భావించి అర్ఘ్య పాద్యాదులను ఇచ్చి వారిని కూర్చుండబెట్టాడు. ఆ

త్రిమూర్తులు,“ మాకు ఒక వ్రతం ఉంది. దాని ప్రకారం మాకు వడ్డించే స్త్రీ వివస్త్రఅయి ఉండాలి” అని చెప్పగా అత్రి ఈ విషయాన్ని అనసూయకు చెప్పగా ఆమె దానికి అంగీకరించింది.

త్రిమూర్తులు స్నానం చేసి వచ్చి కూర్చున్నారు. వారిపైన అనసూయ మంత్రించిన జలాన్ని చల్లగా ఆ ముగ్గురూ చంటిబిడ్డలయ్యారు. ఆమె నగ్నయై వడ్డించి తిరిగి వస్త్రం ధరించి వారిపై మంత్రించిన జలం చల్లింది. అప్పుడు వారు యథాపూర్వకంగా తమ నిజ రూపాలను ధరించగా, వారిని భోజనం చేయమని, వారు భుజించగా వారిని మరల శిశువులుగా చేసి ఉయ్యాలలో పెట్టి ఊపసాగింది. అంతలో సరస్వతి, లక్ష్మి, పార్వతులు తమ భర్తలను వెదుకుతూ వచ్చి అనసూయను పతిభిక్ష పెట్టమని వేడుకొన్నారు. అనసూయ వారికి ఆ ముగ్గురు బిడ్డలను ఇచ్చింది. వారు తమ భర్తలకు నిజ రూపములు వచ్చునట్లు చేయమని ప్రార్థించగా, ఆ బిడ్డలను త్రిమూర్తులుగా చేసి ఇచ్చింది. అంత వారు భార్యా సహితులై అనసూయ మహాత్మ్యమును మెచ్చుకొని, తమ అంశాలతో ముగ్గురు పుత్రులు కలుగుతారు అని ఆశీర్వదించారు.

ఒకసారి కౌశికపత్ని సూర్యుడు ఉదయింపకుండగా శాసించగా లోకోపద్రవము సంభవించింది. బ్రహ్మాది దేవతలు ఆ ఉపద్రవమును బాపమని అనసూయను కోరారు. అనసూయ కౌసికపత్నిని అంగీకరింపజేసి సూర్యోదయ మగునట్లు చేసి ఆమె భర్తని వెంటనే బ్రతికించింది.

అత్రిమహర్షి భార్యతో కలిసి ఋక్ష పర్వతం మీద నివసించి దేవదేవుని గురించి నూరు సంవత్సరాలు ఘోరమైన తపస్సు చేశాడు. ఆ తపోబలంచేత త్రిమూర్తులు ప్రత్యక్షమయ్యారు. అత్రి మహర్షి వారిని పూజించి,“ నేను సత్సంతానార్థమై దేవదేవుని గురించి తపస్సు చేశాను. మీముగ్గురూ ఎందుకు వచ్చారు? మీలో అధకులెవ్వరు? అని ప్రశ్నించాడు. “మాకు భేదం లేదు. మాఅంశాలతో నీకు పుత్రోదయం అవుతుంది” అని దీవించి అదృశ్యులయ్యారు.

కాలక్రమాన అత్రిమహర్షి నేత్ర గోళాలనుండి చంద్రుడు, అనసూయ గర్భంనుండి దత్తాత్రేయ దుర్వాసులు జన్మించి తల్లి తండ్రులకు అమితానందాన్ని చేకూర్చారు.

-సశేషం

# అసత్యం- స్వార్థం

(బుద్ధుని జాతక కథల నుండి)

ఇంద్రజాలం తెలిసిన ఒక చదువురాని గ్రామస్థుడి దగ్గరకు పొరుగూరు నుండి పనీపాటాలేని ఒక యువకుడు వచ్చాడు. ఆ గ్రామస్థుడు ప్రతిరోజూ అడివికి పోయి, మామిడిచెట్టు క్రింద నిల్చుని మంత్రాలు చదవగానే ఆ చెట్టు పండ్లతో బరువెక్కిపోయేది. మరుక్షణంలోనే ఆ పండ్లు మగ్గి క్రిందపడి పోయేవి. ఆ గ్రామస్థుడు వాటిలో తినగలిగనన్ని తిని, మిగిలినవి ఆ గ్రామంలో పేదవారికి వుచితంగా పంచిపెట్టేవాడు.

ఇది తెలిసిన ఆ యువకుడు, ఆ గ్రామస్థుడు తక్కువ కులస్థుడు అయినా సరే అతని కాళ్ళు పట్టుకుని తనకు ఆ విద్యను నేర్పించమని కోరాడు. ఆ గ్రామస్థుడు మొదట్లో నిరాకరించినా చివరకు అంగీకరించి, "నువ్వు ఈ మంత్రవిద్యను ఎన్నడూ నీ స్వార్థానికి వినియోగించ కూడదు. అబద్ధం చెప్పకూడదు. అలా చేసినంత కాలం మాత్రమే యీ విద్య నీకు ఉపయోగపడుతుంది" అని హెచ్చరిక చేసి, నేర్పించాడు.

యువకుడు తన గ్రామానికి తిరిగివచ్చి, యీ మంత్రాన్ని అనేక సార్లు ఉచ్చరిస్తూ, ఎన్నో మామిడిపండ్లను సంపాదించి, వాటిని సంతలో అమ్మి కొద్ది కాలంలోనే ధనవంతుడైపోయాడు.

కొంతకాలానికి రాజుగారికి యీ విషయం తెలిసి, ఆ యువకుడిని పిలిపించి, 'నువ్వు ఈ విద్యను ఎక్కడి నుంచి నేర్చుకున్నావు?' అని అడిగాడు.

తక్కువ కులస్థుడి దగ్గర నుండి తాను యీ విద్యను నేర్చుకున్నానని చెప్పటానికి యిష్టం లేక, ఆ యువకుడు గర్వంగా "రాజా! నేనీ విద్యను ఎక్కడో దూరాన ఉన్న విశ్వవిద్యాలంలోని ఆచార్యుల దగ్గర ఎంతో కష్టపడి నేర్చుకున్నాను" అని చెప్పాడు.

'బాగానే ఉంది. ఈ విద్యను మా ఎదుటగా ప్రదర్శించి చూపించు' అని ఆజ్ఞాపించాడు. రాజుగారు, వారి కుటుంబ సభ్యులు, మంత్రి వర్గం, ఇంకా అనేకమంది అధికారులు, ఆ యువకుడి వెంట

రాజుగారితో కలిసి మామిడితోటలోకి వెళ్ళారు. ఆ యువకుడు ఒక పెద్ద మామిడి చెట్టు ఎన్నుకొని మంత్రాలు చదవటం మొదలు పెట్టాడు. కాని అతడు అబద్ధం చెప్పాడు కాబట్టి ఆ మంత్రం పనిచేయలేదు.

ఎంతో అవమానంతో ఆ యువకుడు రాజుగారికి అసలు సత్యం చెప్పేశాడు. "గర్వంతో నువ్వు నీ గురువుగారికి అపచారం చేశావు కాబట్టి అది ఫలించలేదు. ఇప్పుడు వెళ్ళి ఆయన్ను శరణుపొందు బహుశ తిరిగి నీ మంత్రం ఫలిస్తుందేమో" అని ఆ రాజుగారు హితవు చెప్పాడు.

ఆ యువకుడు తిరిగి ఆ ప్రకారమే చేశాడు. కానీ ఆ మంత్రం ఫలించలేదు. అప్పటికే కాదు ఎప్పటికీ కూడా ఫలించలేదు. కారణాలు ఆ యువకుడు అసత్యం చెప్పటం; తన స్వార్థానికి ఆ మంత్రాన్ని వాడుకోవటం.

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

మే 2016

02 సోమ : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

11 బుధ : శ్రీశంకరాచార్య జయంతి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

21 శని : వైశాఖ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

31 మంగ : శ్రీగురుదశమి- హనుమజ్జయంతి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

జూన్ 2016

20 సోమ : జేష్ఠ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

29 బుధ : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

ప్రసాద్ భద్రాచలంలో మెకానిక్‌గా పని చేస్తున్న రోజులలో, ఒక రోజున అతను కరెంట్ ఆపి, తన ఆఫీసర్‌కు తాను యంత్రంలో చేసిన రిపేరు చూపిస్తూ ఉండగా, ఎవరో తెలియక కరెంట్ స్విచ్ వేశారు. చేతి వ్రేళ్ళు తెగిపోయి, చెయ్యి నుగ్గు నుగ్గయి పోయింది. ఆసుపత్రిలో చేర్చి కోటిపల్లి తాతయ్యగారికి టెలిగ్రాం యిచ్చారు. బాలింతరాలు వల్లి ఆశ్రమంలో ఉంది.



అదే రోజున కడియం పేపరు మిల్లులో పని చేస్తున్న పోతునూరు అక్కయ్యగారి పెద్దల్లుడికి (జనార్దన పరబ్రహ్మం) కడుపు నొప్పి వచ్చింది. అది అపెండిసైటిస్ అని, యిరవై నాలుగు గంటల లోపల ఆపరేషన్ చేయాలన్నారు. ఆ టెలిగ్రాం కూడ అందుకున్న కోటిపల్లి తాతయ్యగారికి బుర్ర తిరిగి పోయింది. గోదావరిలో దూకి చద్దామని వెళ్ళి దూకబోయేసరికి "నేనున్నాను. నువ్వు యిలా చెయ్యకూడదు" అని బిగ్గరగా అంటూ ఎవరో తన గుండెలపై చేతులు వేసి, గట్టిగా వెనక్కి త్రోసివేసినట్లుగా తాతయ్యగారు వెనక్కి పడ్డారు. ఆ గొంతు శ్రీ బాబు గొంతు అని గుర్తించి, తాతయ్యగారు తమ మనస్సులోనే శ్రీబాబుకు నమస్కరించుకుని వెను తిరిగారు.

ప్రసాదు ఆశ్రమానికి వచ్చి ( ఆ రోజు శ్రీ బాబు ఆశ్రమంలో లేరు) అమ్మ గదిలో నమస్కారం చేసుకుని, తన చెయ్యి చికిత్స కోసం కాకినాడ వెళ్ళాడు. అక్కడ డాక్టర్లు తమ వల్ల కాదంటే, హైదరాబాదు, అక్కడా కుదరక, మద్రాసు వెళ్ళాడు. అక్కడ ఆసుపత్రిలో అతని చేతికి కొంత చికిత్స చేసి మళ్ళీ నెల తరువాత రమ్మన్నారు. మళ్ళీ మద్రాసు వెళ్ళే సమయానికి శ్రీ బాబు అమెరికా ప్రయాణంలో ఉన్నారు. మద్రాసు వెళ్ళే రైలులోనే అతను శ్రీబాబును దర్శించుకుని, నమస్కారం చేసుకొని, మద్రాసు వెళ్ళి, ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడు. బాలింతరాలు వల్లి అతనికి తోడుగా ఉంది.

ఒకరోజు అతని దగ్గరనే బల్ల మీద కూర్చుని కళ్ళు మూసుకుని

ఉన్న వల్లికి, శ్రీ బాబు ఆశ్రమంలో ఒక కారులో స్టీరింగ్ వద్ద కూర్చుని వున్నట్లు, ఆయన చేతికి సరిగా ప్రసాదు చేతికి ఉన్న మాదిరిగానే కట్టు కట్టి ఉన్నట్లు, వెనక్కి ఆనుకుని విచారంగా ఉన్నట్లు కనిపించింది. వల్లీ "బాబూ! బాబూ!" అంటూ బిగ్గరగా ఏడవటం మొదలు పెట్టింది. ప్రసాదు లేచి కట్టు ఉన్న చేతితోనే వల్లిని గట్టిగా కుదిపి లేపితే, తనుకు కనిపించిన దృశ్యం చెప్పింది. తన భర్త బాధను తాము తీసుకుని తమకు ఉపశాంతిని, రక్షణను అందిస్తున్నట్లు భావించి వాళ్ళిద్దరూ విలవిలలాడి పోయారు. శ్రీ బాబు ఆర్త రక్షణ పరాయణత్వాన్ని గురించి చాలా సేపు చెప్పుకున్నారు.

తరువాత ప్రసాదు, తనకు జరిగిన వైద్యాన్ని గురించిన వివరాలన్నీ తెలుపుతూ తాను పని చేస్తున్న ఫ్యాక్టరీటి వివరంగా ఆర్జీ పెట్టుకుంటే, వైద్యానికి అయిన ఖర్చులు కొంతవరకైనా వాళ్ళు యివ్వవచ్చునని, చెయ్యి అవుడయి పోయిందని ఉద్యోగం నుంచి తీసివేయకుండా దయ తలచమని వాళ్ళకు వ్రాద్దామని వల్లితో కాగితం కలం తెప్పించి, తాను చెబుతూ వల్లి చేత అర్జీ వ్రాయించాడు. అది తన బ్యాగ్‌లో పెట్టించుకున్నాడు. తరువాత నిద్ర పోతుంటే కల వచ్చింది. కలలో, తాను అమెరికా వెళ్ళినట్లు, అక్కడ ఒక పెద్ద భవంతిలోని ఒక గదిలో తాను వున్నట్లు, శ్రీ బాబు ఆ గదిలోకి వచ్చి తన చేతి కట్లు విప్పి చూసి 83 కుట్లు పడ్డాయని చెప్పినట్లు, తాను వ్రాయించిన అర్జీలో మూడు తప్పులున్నాయని, అవి సరిచేశామని చెప్పినట్లు, గాయం తగ్గి పోతుంది లెమ్మని, డ్యూటీలో తిరిగి చేర వచ్చునని చెప్పినట్లు, వచ్చింది. ప్రసాదు నిద్ర లేచి, అర్జీ తెప్పించి చూస్తే, తప్పులు వ్రాసిన మూడు చోట్ల, వల్లి చేతి వ్రాతతోనే సరిచేసి కొట్టివేతలు లేకుండా, వ్రాసి ఉన్నాయి. ఇదంతా శ్రీబాబు అద్భుత లీల అని, 'డ్యూటీలో చేరవచ్చును' అన్నారు గనుక, వుద్యోగం తనకు మళ్ళీ తప్పకుండా యిస్తారని గ్రహించి, వాళ్ళిద్దరు తన్మయులై పోయారు.

రెండు రోజుల తరువాత డాక్టర్లు కుట్లు విప్పారు. కుట్లు లెక్కపెడితే సరిగా 83 ఉన్నాయి. తర్వాత మందులిచ్చి డాక్టర్లు యింటికి పంపారు. పోతునూరులో ఒక నెల విశ్రాంతి తీసుకొని భద్రాచలం వెళ్ళేసరికి, అతని కుటుంబానికి సరిపడే క్వార్టరు (ఇల్లు) ముందుగానే యిచ్చినట్లు తెలిసింది. తన అర్జీ కాగితాలు సంతకం పెట్టి మరునాడే ఉద్యోగంలో చేరమని చెప్పారు.అంతటి భక్త రక్షణ పరాయణత్వం శ్రీ బాబుకే చెల్లు.

- సశేషం

-గత సంచిక తరువాయి **విష్ణు కథలు** - రమణ ప్రసాద్

# సూరదాస్

పరమ పవిత్రమైన భాగవతంలోని సన్నివేశాలను సూరదాసు చక్కగా వర్ణించసాగాడు. ఆయన అంధుడై ఉండి కూడా శ్రీకృష్ణుని శైశవ దశలను, ఆయన లీలలను అత్యంత అద్భుతంగా ఎలా వర్ణించగలిగాడా? అని పండితులు సహితం ఆశ్చర్యపోయేవారు . కృష్ణుడికి మొదటి సారిగా పన్ను రావటం; ఆయన మొదటి సారిగా 'బాబా' అని అనటం; ఆయన మొదటిసారిగా నడవటం వంటి సన్నివేశాలను ఆయన మనోనేత్రంతో దర్శించి వ్రాశారు. వాటిని ఈరోజున కూడా తల్లులు తమ బిడ్డలను లాలిస్తూ తమ ఇళ్ళల్లో పాడుకుంటూ ఉంటారు. భగవానుని లీలా మాధుర్యాన్ని వివరించిన అతని హృదయమే బృందావనం అయింది. నిరంతరం పారవశ్యంతో దివ్యోన్మాదంతో ఉండేవాడు. సూరదాసుకు ఇంట్లో దొరకని ప్రేమానురాగాలు ఈ అనుభూతుల ద్వారా బాలగోపాలుడు ఆయనకు ప్రసాదించాడు. సూరదాస్ వివాహం చేసుకోదలుచుకోలేదు.



ఆయన వర్ణించిన రాధా కృష్ణుల దివ్యప్రేమ - అది జీవాత్మకు పరమాత్మను చేరుకొనటానికి చేసే తపనను, ఆవేదనను వ్యక్తపరుస్తుంది. సూరదాస్ యశోద కృష్ణుడిని ఉయ్యాలలో పడుకోబెట్టి నిదురబుచ్చే విధానాన్ని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించాడు -

జశోదా హం పాలనేర్ఝులావై
ఇలారావై డులరావై మల్హావో జోయి సోయీ కఛు గావై ॥
మేరేలాల్‌కో ఆవ్ నిదరియాకాహెన ఆని సునావై।
తూకాహెన బేగిసీ ఆవే, తోకో కాన్హా బులావై॥
కబహు పలక్ హరి ముందిలేత్‌హై కబహు అధర్ ఫర్‌కావే,
సోవత్ జాని మౌన్ వహై వహై రహి కర-కర రైన్ బితావై॥

ఇహి అన్తర్ అకులాహ ఉఠె హరి జసుమతి గావై।
జోసుఖ్ సూర్ అమర్ ముని దుర్లభ్ నంద భామినీ పావై॥
"యశోద హరిని ఉయ్యాలలో పడుకోబెట్టి ఊపుతోంది. ఉయ్యాలను కదుపుతూ, కదిలిస్తూ, యశోద ఏవో జోలపాటలు పాడుతోంది.

నా బుజ్జి తండ్రి నిద్ర ఎందుకుపోవటంలేదు? ఓ నిద్రాదేవీ! త్వరగా రా! నిన్ను కన్నయ్య పిలుస్తున్నాడు.

ఇంతలో హరి కనులు మూసుకున్నాడు. నిద్రలో పెదిమలు కదిలిస్తున్నాడు. సరే పడుకున్నాడు కదా అని నిశ్శబ్దంగా అక్కడే చెయ్యి తలకు ఆన్చి పడుకోబోతున్నాను. ఇంతలో హరి ఒక్కసారిగా లేచి ఏడవటం మొదలుపెడితే మళ్ళీ జోలపాట పాడటం మొదలుపెట్టాను."

సూరదాసు అంటున్నాడు -"సురులకు, మునులకు లభ్యంకాని అలోక సుఖం ఈ రూపంలో యశోద పొందుతోంది" అని.

జసుమతి మన్ అభిలాప్ కరై!
కబ్ మేరే లాల్ ఘుటురన్ రేంగే, కబ్ ధరనీ పగ్ ద్వైక ధరై
కబ్ తుమరే ముఖ్ బైన్ భరే, కబ్ నంద హి కహి
బాబా బోలె, కబ్ జననీ కహి మోహి రరై॥
కబ్ మేరో అంచరా గహి గహి మోహన్
జోయీ సోయీ కహి మోసో ఝగరై।
కబధౌ తనక తనక కఛు ఖేవై అపనే కరసో సుఖహి భరై॥
కబ్ ఇస్ బాత్ కహైగో మోసో జవి పేఖిత్ దుఃఖ్ ధూరి టరై।
శ్యామ్ అకేలే ఆంగన్ ఛోడే ఆపుగయీ కఛు కాజ కరె।
యేహి అతుర అంధ్వాయీ ఉఠీ ఇక్
గరజత గగన్ సహిత్ ధ్హరై।
సూరదాస్ వ్రజ్ లోగ్ ధునత్ ధుని జోజహ తహసబ్ అతీహిడరై॥

\- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL